


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 267, పేజీలు - 08

ఆదివారం, మార్చి 15, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## గ్యాస్ కొరత వేళ భారత్‌కు బిగ్ రిలీఫ్

**- హర్మూజ్ జలసంధిని దాటిన ఎల్పీజీ నౌకలు**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల వేళ ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా కలిసి చేస్తున్న దాడులను తిప్పికొట్టేందుకు ఇరాన్ గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతుండటంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాపై భారీ ప్రభావం పడింది. ఈ నేపథ్యంలోనే భారత్‌లోనూ గ్యాస్ కొరత వేధిస్తోంది. ప్రపంచ చమురు రవాణాకు కీలకంగా ఉన్న హారరీ?్మజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం

2లో..

## జిల్లాకు రింగ్ రోడ్డు..

# హైదరాబాద్‌కి లింక్

**- తెలంగాణలో రవాణా గేమ్ చేంజర్ కాబోతుందా.?**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక జాతీయ రహదారులు, రైలు మార్గాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తోంది. ఒక్క తెలంగాణలోనే 2 వేల కిలోమీటర్లకుపైగా రహదారుల నిర్మాణం చేపట్టింది. తాజాగా రేవంత్ సర్కార్ కూడా రహదారుల విస్తరణ, కొత్త మార్గాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోంది. అభివృద్ధికి రహదారులు కీలకంగా మారడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ జిల్లా కేంద్రానికి రింగ్ రోడ్లు నిర్మించేందుకు ప్రణాళిక రచిస్తోంది. ఇది రాష్ట్రవ్యాప్త రవాణా వ్యవస్థను ఆధునికీకరించి, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది.

**- మొదట మూడు ఉమ్మడి జిల్లాల్లో..**

రాష్ట్రంలోని ప్రతీ ప్రధాన జిల్లా కేంద్రం(హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటివి) చుట్టూ రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు, ఇవి దగ్గర్లోని జాతీయ రహదారులు, హైవేలతో అనుసంధానం కలిగి ఉంటాయి. ఇది హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్, 340--347 కి.మీ. పొడవు, 4--6 లేన్లు)ను సప్లిమెంట్ చేస్తూ, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)కు వెలుపలి ప్రాంతాల్లోకి విస్తరిస్తుంది. మొత్తం 1,940 హెక్టార్ల భూమి అవసరం, భూసేకరణ ఇప్పటికే ప్రారంభమైంది.

**ప్రయోజనాలు..**




రింగ్ రోడ్ల నిర్మాణంతో 24 పట్టణాలు, 200 గ్రామాలను అనుసంధానం చేస్తుంది. దీంతో ట్రాఫిక్ 30 నుంచి 40 శాతం తగ్గుతుంది. లాజిస్టిక్స్ ఖర్చు తగ్గుతుంది. ఇండస్ట్రియల్ క్లస్టర్లు, లాజిస్టిక్ పార్కులు, రియల్ ఎస్టేట్, ఐటీ హబ్‌లు ఏర్పాటుకు అవకాశం కలుగుతుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గ్రీన్‌ఫీల్డ్ రహదారులు, 72 హెక్టార్ల అటవీ భూమి

2లో..


# భారత విరోధి కాంగ్రెస్

**- మోదీ తీవ్ర ఆగ్రహం**



డిస్పూర్ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం మనపై ఉందని, ఒక విధంగా యుద్ధం లాంటి పరిస్థితి కనిపిస్తోందని, ఇలాంటి తరుణంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ దేశంలో, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. అసోంలోని సిల్చార్‌లో ప్రధానమంత్రి పర్యటించారు. ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో ఆందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఆ పార్టీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో భయాందోళనలు సృష్టించి తనను వేధించాలని చూస్తున్నారని అన్నారు. మనదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారుతోందని ఆరోపించారు.

2లో..



# ఏపీలో వంట గ్యాస్ కష్టాలు

**- మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం**

అమరావతి (ప్రశ్న న్యూస్) ఇరాన్- ఇజ్రాయెల్ వార్, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీని కారణంగా మన దేశంలోనూ డిమాండ్‌కు తగినట్లు కమర్షియల్ గ్యాస్ దొరకని పరిస్థితి. దీంతో చాలా రాష్ట్రాల్లో హోటళ్లు మూసేశారు. ఇక ప్రజలు సాధారణంగా వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలోనూ ఆందోళన నెలకొంది. సరిపడా నిల్వలు ఉన్నాయని కేంద్రం చెబుతున్నా ప్రజలు మాత్రం వంట గ్యాస్ దొరుకుతుందో లేదోనని భయాందోళనలకు గురవుతున్నారు. ముందస్తు బుకింగ్‌లు చేస్తున్నారు. ఏపీలోనూ వంట గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

ప్రస్తుతం ఏపీలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై పలువురు మంత్రులతో సీఎం చంద్రబాబు శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ప్రస్తుత పరిస్థితిపై మంత్రి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. గ్యాస్ సరఫరా అంశంపై

2లో..

# సీఎం వ్యవహారం చాలా వింతగా ఉంది

**- మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎంపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఖజానాలో డబ్బులు లేవంటూనే, వేలకోట్ల రూపాయలతో మూసీ ప్రాజెక్టును చేపడతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి వ్యవహారం చాలా వింతగా ఉందని అన్నారు. తినడానికి మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనె అన్నట్లుగా ఆయన తీరు ఉందని ఎద్దేవా చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్లు దండుకుంటామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని ఒకవైపు చెబుతూనే, మరొకవైపు మూసీ ప్రాజెక్టును చేపడతానని చెప్పడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీ సుందరీకరణ చేపట్టారని వెల్లడించారు. అసలు మూసీ మురికి కూపంగా మారింది కాంగ్రెస్ హయాంలోనే అని ముఖ్యమంత్రి గుర్తించాలని అన్నారు. మూసీ పునరుజ్జీవంపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యమంత్రి మాట్లాడిన సమయంలో, మూసీ బాధితులకు ఉపశమనం ఇచ్చే ప్రకటన ఏదైనా చేస్తారా అని చూశామని,

2లో..



## గిరిపుత్రుల గడపకు

# ఉప ముఖ్యమంత్రి

**- అల్లూరి జిల్లాలో పవన్ కళ్యాణ్ 'మాటా-మంతి'**



అమరావతి (ప్రశ్న న్యూస్) అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అత్యంత మారుమూల గిరిశిఖర గ్రామమైన నందిగరువులో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని, జనసేన పార్టీ 13వ ఆవిర్భావ వేడుకలను ఆడంబరాలకు పోకుండా గిరిజన గూడెం మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన 'మాటా-మంతి' కార్యక్రమంలో

2లో..

## కల్తీ నిర్వాహకులను పట్టుకోవడంలో

# ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది

**- తెలంగాణలో పెరుగుతున్న కల్తీ ఫుడ్ అంటూ కవిత ట్వీట్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్నట్లు స్పష్టం అవుతోంది. ఇటీవల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు, కల్తీ పెరుగు గుట్టు రట్టు అయిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గడచిన మూడేళ్లలో 14,312 ఫుడ్ శాంపిల్స్ ను టెస్టింగ్ చేయగా కేవలం 16 లైసెన్సులు మాత్రమే రద్దు చేసినట్లు సమాచారం. అలాగే జీరో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇదే విషయంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ట్వీట్ చేశారు. కల్తీ నిర్వాహకులను పట్టుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని అన్నారు. తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. నిందితులను శిక్షించడంలో విఫలం అవుతున్నారని ట్వీట్ చేశారు.



ప్రభుత్వ డేటా ప్రకారం ఫుడ్ శాంపిల్ టెస్టులు గణనీయంగా దాదాపు 46 శాతం తగ్గినట్లు తెలిపారు. అలాగే సివిల్ కేసులు

2లో..

## కొండగట్టుకు బండి సంజయ్

# 'అంజన్న ఆశీర్వాద యాత్ర'

**- డ్రోన్ తగలడంతో తేనెటీగల దాడి**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అంజన్న ఆశీర్వాద యాత్ర పేరుతో కరీంనగర్ నగరంలోని మహాశక్తి ఆలయం నుంచి బీజేపీ నేత, కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ కొండగట్టు అంజన్న ఆలయం వరకు మహా పాదయాత్రను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ యాత్రలో భాగంగా కేంద్రమంత్రితో పాటు ఇటీవల జరిగిన కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కార్పొరేటర్లు కూడా ఆయన వెంట పాదయాత్రలో పాల్గొన్నారు. బీజేపీ పార్టీ కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకుంటే కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టుకు పాదయాత్రకు వస్తానని బండి సంజయ్ మొక్కుకున్నారు. ఇక ఈ మొక్కుకు



సంబంధించిన విషయాన్ని మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తేల్చి చెప్పారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు 10 వేల మంది కార్యకర్తలు కూడా బండి సంజయ్ పాదయాత్రకు

2లో..


# బీఆర్ఎస్‌లో చేరే యోచనలో జీవన్ రెడ్డి.?

**- ఫిరాయింపు ఎమ్మెల్యేతో పొసగకపోవడం వల్లే!**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ మారే అవకాశం కనిపిస్తోంది. జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాల్లో జీవన్ రెడ్డికి, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు మధ్య ఎప్పటి నుంచో పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వైరం ఉంది. గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ బీఆర్ఎస్ నుంచి గెలవగా, జీవన్ రెడ్డి ఓటమి పాలయ్యారు. అయితే, అనూహ్యంగా సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకు ప్రభుత్వం, పార్టీలో ప్రాధాన్యత పెరగడం జీవన్ రెడ్డికి మింగుడుపడటం లేదు. తనను సంప్రదించకుండానే బద్ధ శత్రువును పార్టీలోకి తీసుకోవడం తనను అవమానించడమేనని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. పార్టీపై ఆయన చాలా కాలంగా అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

**- కేసీఆర్‌తో భేటీకి రంగం సిద్ధం**

ఇటీవల ఆయన తాను పార్ట మారే ఆలోచనలో ఉన్నానని చెబుతున్నారు. ఈ క్రమంలో జీవన్ రెడ్డి ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నెల 20వ



తేదీ తర్వాత ఆయన హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసి, గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉంది. ఇప్పటికే జగిత్యాలలోని తన అనుచరులతో,

2లో..

# ప్రీ-లాంచ్ మోసం

TG RERA
TELANGANA REAL ESTATE REGULATORY AUTHORITY

**-భారతి బిల్డర్స్‌పై రెరా కొరడా - డబ్బు వాపసు చేయాలని ఆదేశం**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నిబంధనలను ఉల్లంఘించి ప్రీ-లాంచ్ స్కీమ్ పేరుతో కొనుగోలుదారుల నుంచి డబ్బులు వసూలు చేసిన భారతి బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా) కఠిన చర్యలు తీసుకుంది. ఆ సంస్థకు మొత్తం రూ. 4.74 కోట్ల భారీ జరిమానా విధించడంతో పాటు, దానిని 'డిఫాల్టర్ ప్రమోటర్'గా ప్రకటించింది. బాధితులకు 60 రోజుల్లో వడ్డీతో సహా పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కొంపల్లిలోని 'భారతీ లేక్ వ్యూ అపార్ట్‌మెంట్స్' ప్రాజెక్టుకు సంబంధించి పలువురు కొనుగోలుదారులు రెరాకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అథారిటీ, బిల్డర్ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. 2021లో ప్రీ-లాంచ్ ఆఫర్ల ద్వారా కొనుగోలుదారుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిన భారతి బిల్డర్స్, 24 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. అయితే, రెరా రిజిస్ట్రేషన్ గానీ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు గానీ లేకుండానే నిధులు సేకరించి, ఇంతవరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై రెరా ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రాజెక్టు పూర్తయ్యే సూచనలు కనిపించకపోవడంతో, కొనుగోలుదారులు అందులో కొనసాగాల్సిన

2లో..

# గ్యాస్ కొరత వేళ భారత్‌కు బిగ్ రిలీఫ్

ఒక చల్లటి వార్త చెప్పింది. భారత్‌కు ఎల్పీజీని తీసుకువస్తున్న రెండు షిప్‌లు హరరీ?్మజ్ జలసంధిని సురక్షితంగా దాటి బయటికి వచ్చినట్లు తెలిపింది.ఇక పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో హర్మూజ్ జలసంధికి రెండు వైపులా వందల కొద్దీ నౌకలు చిక్కుకుపోయాయి. అయితే భారత జెండాలు ఉన్న నౌకలను హర్మూజ్ జలసంధి గుండా వెళ్లేందుకు అనుమతి ఇస్తామని ఇప్పటికే ఇరాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా రెండు భారత జెండాలు ఉన్న ఎల్పీజీ నౌకలు శనివారం సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటినట్లు కేంద్ర భారత ప్రభుత్వం వెల్లడించింది. శివాలిక్, నందాదేవి పేరు ఉన్న గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నట్లు కేంద్రం షిప్పింగ్ మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్‌కుమార్ సిన్హా స్పష్టం చేశారు.ఈ శివాలిక్, నందాదేవి నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఈ రెండు నౌకలు.. ఈనెల 16వ తేదీ లేదా 17వ తేదీన భారత్ తీరానికి చేరుకునే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. గత కొన్ని రోజులుగా దేశంలో ఎల్పీజీ సరఫరాపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతోన్న వేళ.. ఈ రెండు షిప్‌లు త్వరలోనే భారత్‌కు చేరుకోనుండటం భారీ ఊరటను కలిగించే అంశంగా మారింది.

మరోవైపు డొమెస్టిక్ గ్యాస్ సరఫరాలో ఎలాంటి అడ్డంకులు లేవని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. గృహాలకు వినియోగించే సిలిండర్ల విషయంలో ప్రజలెవరూ ఆందోళన పడొద్దని తేల్చి చెప్పింది. గ్యాస్ కొరత ఊహాగానాలతో అవసరం లేకపోయినా చాలామంది వినియోగదారులు ముందస్తుగా బుకింగ్ చేస్తున్నారని పేర్కొంది. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ల బ్లాక్‌మార్కెట్‌ను అడ్డుకోవాలని అన్ని రాష్ట్రాలకు సూచించినట్లు తెలిపింది. అదే సమయంలో ఆకస్మిక తనిఖీలు కూడా చేస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే దేశంలో గ్యాస్, ఎల్పీజీ సరఫరా, నిల్వలపై పెరుగుతున్న ఆందోళనల వేళ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను పెట్రోలియం శాఖ అధికారులు మీడియాకు వెల్లడించారు. ప్రాధాన్యత క్రమంలో వాణిజ్య సిలిండర్లను సరఫరా చేస్తున్నామని అధికారులు తెలిపారు.

ప్రస్తుతానికి ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, బిహార్ రాష్ట్రాల్లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేస్తున్న వారిపై దాడులు చేస్తున్నామని వివరించారు. ఎల్పీజీ సరఫరాలో ఇళ్లు, హాస్పిటల్స్, హాస్టళ్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సిలిండర్‌లు బుకింగ్ కావడం లేదని చాలా మంది ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్న పెట్రోలియం శాఖ అధికారులు గ్రామాల్లో 45 రోజులు, పట్టణాల్లో 25 రోజుల కనీస బుకింగ్ గడువు ఉందని గుర్తు చేశారు.

## జిల్లాకు రింగ్ రోడ్డు..

# హైదరాబాద్ కి లింక్

రక్షణ, భవిష్యత్తులో ఆరు లేన్ల విస్తరణతో పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది.

**- ప్రణాళిక అమలులో సవాళ్లు..**

భూసేకరణ ఆలస్యాలు, ఖర్చు పెరగడం ప్రధాన సమస్యలు. కానీ ఎన్‌హెచ్ఏఐ సహకారంతో 5 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారు. మూడేళ్లలో పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. ఈ రింగ్ రోడ్లు తెలంగాణను లాజిస్టిక్స్ హబ్‌గా మార్చి, గేమ్ చేంజర్ అవుతాయి.

# భారత విరోధి కాంగ్రెస్

అసోం ప్రజలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీని ఎప్పుడో తరిమి కొట్టారని కితాబిచ్చారు. రానున్న ప్రతి ఎన్నికల్లో ప్రతి రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతుందని అన్నారు. అసోం పట్ల లేదా దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కానీ మోదీని ఎలా విమర్శించాలో, అబద్ధాలు చెప్పి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించాలో తెలుసని ఎద్దేవా చేశారు. కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నాయకులు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కూడా ప్రధాని స్పందించారు. వారి చర్యను యావత్ దేశం ఖండించిందని అన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ పార్టీ దేశం పైనే దాడికి దిగిందని మండిపడ్డారు. నిరాశతో దుస్తులు చించుకోవడం తప్ప వారికి మిగిలిందేమీ లేదని అన్నారు.

# ఏపీలో వంట గ్యాస్ కష్టాలు

మంత్రుల సబ్‌కమిటీ ఏర్పాటు కాగా ఈ కమిటీ సమావేశం కానున్నట్లు ఆయన సీఎం చంద్రబాబుకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పరంగా ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన చర్యలను పూర్తిస్థాయిలో తీసుకోవాలని సీఎం మంత్రులకు సూచించారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం రాకుండా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని మంత్రులను దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా హోటళ్లు సహా సంబంధిత భాగస్వామ్య వర్గాలతో చర్చలు జరిపాలని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇక ఎల్పీజీ గ్యాస్ ధరల పెంపుపై వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. ఆయిల్ కంపెనీల నుంచి అందిన సమాచారం మేరకు డొమెస్టిక్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరపై అదనంగా రూ.60లు, కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరపై అదనంగా రూ.115లు పెంచినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద తగినంత గ్యాస్ నిల్వలు ఉన్నందున గ్యాస్ వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అంటున్నారు. అవసరానికి మించి అదనపు బుకింగ్స్ చేయకుండా వినియోగదారులు సహకరించాలని కోరుతున్నారు.

## సీఎం వ్యవహారం

# చాలా వింతగా ఉంది

కానీ ఆ ప్రస్తావనే లేదని విమర్శించారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని ముఖ్యమంత్రి చెబుతున్నారని, రైతుబంధు, రిటైర్డ్ ఉద్యోగులకు కూడా ఇచ్చేందుకు డబ్బులు లేవని చెప్పారని, కానీ ఇప్పుడు మూసీ ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతానని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. 2 వేల కిలోమీటర్ల నమామి గంగే ప్రాజెక్టు ఖర్చు రూ.42,500 కోట్లు అని, గుజరాత్ సబర్మతికి అయిన ఖర్చు రూ.7 వేల కోట్లు అని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. అందాల పోటీలు నిర్వహించడానికి రూ.200 కోట్లు ఖర్చు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, హామీల అమలుకు మాత్రం డబ్బులు లేవంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఒక్క ఇంటినైనా నిర్మించిందా అని ప్రశ్నించారు.

## కల్తీ నిర్వాహకులను పట్టుకోవడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది

కూడా 71 శాతం తగ్గిపోయినట్లు కవిత స్పష్టం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఒక్కటంటే ఒక్కటి కూడా క్రిమినల్ కేసు నమోదు చేయకపోవడం గమనార్హం అని తెలిపారు. కేవల ఒకే ఒక లైసెన్స్ ను రద్దు చేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని ఇతర రాజకీయ పార్టీలు కూడా ఈ విషయంపై పోరాడకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ మేరకు ఇటీవల పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నలకు బదులుగా కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ తీరును రాతపూర్వకంగా తెలియజేసింది. ఈ విషయాలను కవిత తన ట్వీట్ లో ప్రస్తావించారు. ఇక శిక్షలు వేయడంలో, లైసెన్స్ లను రద్దు చేయడంలో తెలంగాణ రాష్ట్రంతో పోలిస్తే కర్నాటక, కేరళ, ఏపీ తదితర రాష్ట్రాలు చాలా ముందున్నట్లు నివేదిక ద్వారా తెలుస్తోంది. ఇక ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే కల్తీకి పాల్పడితే కఠినమైన జైలు శిక్షలు పడేలా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# బీఆర్ఎస్‌లో చేరే యోచనలో జీవన్ రెడ్డి.?

కీలక నేతలతో ఆయన వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ మార్పుపై క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ పూర్తి చేశారని, మెజారిటీ అనుచరులు ఆయన నిర్ణయానికి మద్దతు తెలిపారని సమాచారం.

**- కాంగ్రెస్ బుజ్జగింపులు విఫలం**

జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీ వీడకుండా ఉండేందుకు కాంగ్రెస్ అధిష్టానం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి బుజ్జగించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ, సంజయ్ కుమార్ విషయంలో తనకు జరిగిన అన్యాయాన్ని ఆయన గట్టిగా ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడితే, ప్రత్యర్థిని తెచ్చి నెత్తిన కూర్చోబెట్టడం ఏమిటి అని ఆయన తన సన్నిహితుల వద్ద వాపోయినట్లు సమాచారం. ఈ పరిణామా కారాణం ఆయన వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదని చెబుతున్నారు. ఒకవేళ జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరితే, జగిత్యాల నియోజకవర్గంలో సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. కాంగ్రెస్ కేడర్‌లో చీలక రావడం ఖాయం. అటు బీఆర్ఎస్‌కు ఈ సీనియర్ నేత రాక పెద్ద బలాన్ని ఇస్తుందని ఆ పార్టీ భావిస్తోంది. పార్టీ మారే అంశంపై జీవన్ రెడ్డి నుంచి త్వరలోనే ఒక అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

**- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ కీలక నేత**

కాంగ్రెస్ పార్టీతో తాటిపర్తి జీవన్ రెడ్డికి దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా విడదీయలేని అనుబంధం ఉంది. 1980వ దశకంలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, జగిత్యాల నియోజకవర్గం నుండి ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి ఆ ప్రాంతంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోడ్లు, భవనాల శాఖ వంటి కీలక మంత్రి పదవులను నిర్వహించిన జీవన్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అత్యంత సన్నిహితుడిగా ఉండేవారు. ఓటమి ఎదురైనప్పుడు కూడా పార్టీని వీడకుండా విధేయుడిగా ఉన్న ఆయన తెలంగాణ ఉద్యమం తర్వాత వెనుకబడిపోయారు. వరుసగా ఓడిపోతూ వస్తున్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసినా ఓడిపోయారు.

## గిరిపుత్రుల గడపకు

# ఉప ముఖ్యమంత్రి

ఆయన గిరిజనులతో నేరుగా ముచ్చటించి, దశాబ్దాలుగా వారు ఎదుర్కొంటున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. 70 ఏళ్లుగా సరైన బాట లేని నందిగరువు గ్రామానికి రూ. 2 కోట్లతో నిర్మించిన నూతన రోడ్డును ఆయన పరిశీలించారు.

**- పీపుల్ ఫ్రెండ్లీ గవర్నెన్స్**

తమది పూర్తిగా పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ప్రజల కన్నీరు తుడవడమే తమ నిబద్ధత అని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతాలకు అందాల్సిన నిధులను అడ్డగోలుగా మళ్లించడం వల్లే ఏజెన్సీ ప్రాంతాలు వెనుకబడ్డాయని ఆయన విమర్శించారు. జలజీవన్ మిషన్ పథకంలో రూ. 4 వేల కోట్లు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. సమస్యలు చెప్పుకోవడానికి అప్పటి ఎమ్మెల్యేల దగ్గరకు వెళ్తే కనీసం గ్రామం ఎక్కడుందో కూడా తెలియని పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగమే ప్రజల గడప దగ్గరకు వచ్చిందని పేర్కొన్నారు.

**- అభివృద్ధిలో వివక్షకు తావులేదు**

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిని అందిస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో కూటమి అభ్యర్థులు గెలవకపోయినా, తాము ఎక్కడా వివక్ష చూపలేదని ఆయన గుర్తు చేశారు. మీరు ఓట్లు వేశారా లేదా అని మేము చూడటం లేదు, మీరు బాగుండాలనేదే మా ఆకాంక్ష అని ఆయన భావోద్వేగంగా మాట్లాడారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాలకు రావడానికి నాయకులు భయపడతారని, కానీ ప్రజల కోసం పనిచేసే తనకు ఎలాంటి భయాలు లేవని, గిరిజన హక్కులకు భంగం వాటిల్లకుండా అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు.

**- క్షేత్రస్థాయిలో పరిష్కారాలు**

కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై పవన్ కళ్యాణ్ అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఓనూరు ప్రాథమిక పాఠశాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో పాటు, నందిగరువులోనే నూతన అంగన్వాడీ కేంద్రం, పాఠశాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గిరిశిఖర ప్రాంతాల్లో గర్భిణీలు పడుతున్న డోలీ మోతల కష్టాలను తప్పించడానికి రాబోయే కాలంలో మరిన్ని రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా రక్షిత మంచినీటిని ప్రతి ఇంటికి అందిస్తామని, జీవో నెంబర్ 3 పునరుద్ధరణ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు.

**- నిబద్ధతతో కూడిన పాలన**

ఏజెన్సీలో గడిచిన 18 నెలల్లోనే 460 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించడం ఒక రికార్డు అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో పాఠశాల భవనాలు, తాగునీటి సౌకర్యాలు మెరుగుపరచడానికి తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పవన్ కళ్యాణ్ రాకతో మారుమూల గిరిజన గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

## కొండగట్టుకు బండి సంజయ్ ‘అంజన్న ఆశీర్వాద యాత్ర’. శ్రీకారం చుట్టారు.

అయితే బండి సంజయ్ చేపట్టిన అంజన్న ఆశీర్వాద యాత్ర పాదయాత్రలో బీజేపీ కార్యకర్తలు, అభిమానాలు, ప్రజలు భారీ ఎత్తున హాజరై ఆయన వెంట నడిచారు. ఈ యాత్ర రామడుగు మండలం కోన్‌రావు పేట వద్దకు రాగానే ఊహించని సంఘటన చోటు చేసుకుంది. పాదయాత్ర కోన్‌రావు పేట సమీపంలోకి రాగానే ఆ వీడియోలను తీసేందుకు బీజేపీ కార్యకర్తలు డ్రోన్‌ను ఎగురవేశారు. అయితే ఆ డ్రోన్ నేరుగా వెళ్లి రోడ్డు పక్కనే చెట్టుకు ఉన్న తేనెతుట్టెను తాకడంతో ఒక్కసారిగా తేనెటీగలు వాడిపై దాడి చేశాయి. దీంతో అక్కడ ఒక్కసారిగా తీవ్ర గందరగోళం తలెత్తింది. తేనెటీగలు కొందరు బీజేపీ కార్యకర్తలపై దాడి చేయడంతో వారికి గాయాలు అయ్యాయి. వెంటనే అలర్ట్ అయిన కేంద్రమంత్రి బండి సంజయ్ గాయపడిన కార్యకర్తలకు ట్రీట్‌మెంట్ ఇప్పించారు. దీంతో అక్కడి గందరగోళం సద్దుమణిగింది. దీంతో ఆ తర్వాత బండి సంజయ్ మళ్లీ పాదయాత్ర కొనసాగించారు. చివరికి అంజన్న ఆశీర్వాద యాత్ర ఎట్టకేలకు కొండగట్టుకు చేరుకుంది. కేంద్రమంత్రి బండి సంజయ్ సహా బీజేపీ కార్యకర్తలంతా కొండగట్టు అంజన్నను దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు.

# ప్రీ-లాంచ్ మోసం

అవసరం లేదని అథారిటీ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, బాధితులు చెల్లించిన పూర్తి మొత్తాన్ని వడ్డీతో కలిపి 60 రోజుల్లోగా వాపసు చేయాలని ఆదేశించింది. ఈ ప్రాజెక్టులో భాగస్వామి అయిన ‘శ్రీ భారతి’ అనే మరో సంస్థను కూడా ప్రమోటర్‌గా పరిగణిస్తూ, రెండు సంస్థలూ ఉమ్మడిగా ఈ బాధ్యత వహించాలని తీర్పునిచ్చింది. నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను భారతి బిల్డర్స్‌పై కొత్తగా రూ. 3.55 కోట్లు జరిమానా విధించింది. గతంలో ఇదే తరహా ఉల్లంఘనలకు విధించిన రూ. 1.18 కోట్ల జరిమానాకు ఇది అదనమని రెరా పేర్కొంది.


ఈ సందర్భంగా రెరా ప్రజలకు కీలక సూచనలు చేసింది. రెరా రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టులలో ‘ప్రీ-లాంచ్’ ఆఫర్లు చట్టవిరుద్ధమని, అలాంటి పథకాలలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని హెచ్చరించింది. రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టులపై రెరా పర్యవేక్షణ ఉండదని, ఎస్క్రో ఖాతా వంటి ఆర్థిక భద్రతలు కొనుగోలుదారులకు లభించవని స్పష్టం చేసింది. ఏదైనా ప్రాజెక్టులో ఫ్లాట్ కొనుగోలు చేసే ముందు, దాని రెరా రిజిస్ట్రేషన్ వివరాలను అధికారిక వెబ్‌సైట్ లో ధ్రువీకరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## బొజ్జల సుధీర్ రెడ్డి నూతన గృహ ప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి....



**రేణిగుంట మార్చి 14.** శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే, ఆప్తమిత్రులు బొజ్జల సుధీర్ రెడ్డి నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా జరిగింది.ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి ప్రత్యేకంగా విచ్చేసి బొజ్జల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కూటమి ముఖ్య నాయకులు,మరియు బొజ్జల కుటుంబ శ్రేయోభిలాషులు పాల్గొన్నారు, విచ్చేసిన అతిథులందరికీ సుధీర్ రెడ్డి ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చారు.

## ఎమ్మెల్యే బండ్ల కుమారుడి వివాహానికి హాజరయిన సీఎం రేవంత్



**గద్వాల** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జోగులాంబ గద్వాల జిల్లా గద్వాలలో శనివారం జరిగిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కుమారుడు సాయి సాకేత్ రెడ్డి ? ఐశ్వర్యల వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## భారీ ఎత్తున ఉద్యోగాల కోతకు

# సిద్ధమైన మెటా

ప్రపంచ దిగ్గజ టెక్నాలజీ సంస్థ మెటా భారీ స్థాయిలో ఉద్యోగాల కోతకు సిద్ధమైంది.దాదాపు 16 వేల మంది ఉద్యోగులను తొలగించే యోచనలో సంస్థ ఉన్నట్లు సమాచారం.కంపెనీ మొత్తం సిబ్బందిలో సుమారు 20 శాతం మందిపై ప్రభావం పడే అవకాశం ఉంది.ఏఐ (కృత్రిమ మేధస్సు) వేగంగా విస్తరిస్తుండటంతో టెక్ రంగంలో ఉద్యోగాల నిర్మాణం మారుతోంది.ఖర్చులు తగ్గించడం, ఏఐ ఆధారిత వ్యవస్థలను పెంచడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

## పిడుగురాళ్లలో జనసేన పార్టీ

# ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- దూదేకుల ఖాసీం సైదా టీం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ**



**పిడుగురాళ్ల** జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన జిల్లా జాయింట్ సెక్రెటరీ దూదేకుల ఖాసీం సైదా టీం ఆధ్వర్యంలో శనివారం పిడుగురాళ్ల పట్టణంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన గురజాల నియోజకవర్గం సమన్వయకర్త కటికం అంకారావు చేతులమీదగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా జనసేన నేతలు మాట్లాడుతూ, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించి, ఓటమిని సైతం పట్టుదలగా మార్చి ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా అవసరాలకు అనుగుణంగా ఎన్నో పోరాటాలు చేస్తూ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో తనదైన శైలితో పరిపాలన అందిస్తున్నారని, గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేస్తూ, వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహా నాయకుడు పవన్ కళ్యాణ్ అని, తన సొంత సొమ్మును పార్టీ కోసం, రాష్ట్ర ప్రజల కోసం ఖర్చు పెడుతూ రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. పవన్ కళ్యాణ్ సూచన మేరకు అనేక సేవా కార్యక్రమాల్లో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలో వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చడానికి మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టామని అన్నారు, రాబోయే రోజుల్లో పార్టీ తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి జనసేన పార్టీ మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు దూదేకుల సలీం, దాచేపల్లి మండల అధ్యక్షులు పాముల కిషోర్, గురజాల మండల అధ్యక్షులు ఉప్పిడి నరసింహారావు, పిడుగురాళ్ల మండల కార్యదర్శి మందా జెస్సి, షేక్ గఫూర్, దూదేకుల ఖాసీం, వీరమహిళలు సింగంశెట్టి వెంకట రమణ, కొత్త అరుణ, షేక్ ఇస్మాయిల్,సంపత్, సిద్దెల సతీష్, నకరికంటి నర్సి, వెంకటాద్రి, పెడ కొలిమి కిరణ్ కుమార్, బూర్స్ వీరయ్య, గుంజి నాగుల్ మీరా, రామదాసు, చింతకాయల కళ్యాణ్, గురసాలా ప్రసాద్, బీమా వెంకటేష్, భవిరిశెట్టి శ్రీనివాసరావు, సైదావలి, కోలా చరణ్, సయ్యద్ ఖాసీం, బాషా తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు



నాచారం(ప్రశ్న న్యూస్) నాచారంలోని హజ్రత్ బిలాల్ మసీదులో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని, రంజన్ మాసం సందర్భంగా మాజీ సైనికుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మామిడాల సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. పేద ముస్లింలకు తోఫా లను అందించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మైనారిటీల కోసమే కట్టుబడి పని చేస్తున్న పార్టీగా చెప్పారు. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ శ్రీపాద రావు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పలు కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మొక్కలను నాటడం, రక్తదాన కార్యక్రమం, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి

# పుష్పయాగానికి అంకురార్పణ



శ్రీనివాసమంగాపురం(ప్రశ్న న్యూస్) శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మార్చి 15న జరుగనున్న పుష్పయాగానికి శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు పుణ్యాహ వచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం చేపట్టారు. మార్చి 15న ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు పుష్పయాగం జరుగనుంది. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి సంపంగి, రోజా, కలువలు వంటి పలురకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారకులు, అధికార అనధికారులు, భక్తుల వల్ల తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహణ వల్ల సమస్తదోషాలు తొలగిపోతాయని విశ్వాసం. శ్రీవారి పుష్పయాగాన్ని పురస్కరించుకుని మార్చి 15న నిత్య కల్యాణోత్సవం సేవను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు ముని శంకర్, ధనశేఖర్ పాల్గొన్నారు.

## అంకాలమ్మ తల్లి తిరుణాలకు

# మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు ఆహ్వానం



**నంద్యాల** గోస్పాడు మండలం, సాంబవరం గ్రామంలో వెలసియున్న శ్రీ అంకాలమ్మ తల్లి తిరుణాల మహోత్సవ ఆహ్వాన పత్రికను నంద్యాల మంత్రి గారి క్యాంపు కార్యాలయం నందు రాష్ట్ర మైనారిటీ మరియు న్యాయశాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారికి సాంబవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు శనివారం అందజేశారు. ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామంలో శ్రీ అంకాలమ్మ తల్లి తిరుణాల మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని. పండుగ రోజున ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన "ఎద్దుల బల ప్రదర్శన" (బండ లాగుడు పోటీలను) ప్రారంభించవలసిందిగా మంత్రి ఫరూక్ గారిని సాంబవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గోస్పాడు మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వర్ రెడ్డి , సాంబవరం గ్రామ మాజీ సర్పంచ్ జూపల్లి రామగోపాల్ రెడ్డి , టిడిపి నాయకులు జూపల్లి రామ భూపాల్ రెడ్డి ,జూపల్లి వెంకటరమణారెడ్డి , వాల్మీకి సంఘం సభ్యులు ఎస్ ఆదినారాయణ ,గోపవరం చంద్రుడు ,ఎం వెంకటయ్య చెన్నూరు నాగేంద్ర ,కొత్తపల్లి నాగలింగం ,కడియాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# జనసేన మరింత బలపడుతుంది

**- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**తిరుపతి** జనసేన పార్టీ 13వ ఆవిర్భావ వేడుకలు ఎన్జీఓ కాలనీలోని తన కార్యాలయ ఆవరణలో శనివారం ఉదయం పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. కాగా రుయా ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ లు సంయుక్తంగా పంపిణీ చేశారు.

జనసేన పార్టీ భవిష్యత్ లో మరింత బలపడుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. 12ఏళ్ళ జనసేన ప్రస్థానంలో ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొన్నాపార్టీ బలంగా నిలబడగలిగిందని ఆయన చెప్పారు. 150 మందితో ప్రారంభమైన జనసేన 13లక్షల మంది క్రియాశీలక సభ్యులను కలిగి ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమి క్రియాశీలక సభ్యత్వ నమోదుతో క్రియాశీలక సభ్యత్వం మరింత పెరుగుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్ళాలని పార్టీ శ్రేణులను ఆయన కోరారు. డిప్యూటీ సిఎంగా పవన్ కళ్యాణ్ తన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని ఆయన తెలిపారు.

# కష్టపడితేనే ఫలితం.. ఇష్టపడితేనే విజయం

**-మండల విద్యాశాఖ అధికారిణి శైలజా**

**-10వ తరగతి విద్యార్థులకు ఎంఈఓ శైలజ దిశానిర్దేశం**

**-తల్లిదండ్రుల కలలను నిజం చేయడమే విద్యార్థుల లక్ష్యం కావాలి**

**-ఈ కొన్ని రోజులు సామాజిక మాధ్యమాలకు స్వస్తి పలకండి.**

**-పరీక్షా హాలులో ప్రతి నిమిషం విలువైనదే.**

**-భయం వీడి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి.**

**-100 రోజుల ప్రణాళికే.. ప్రగతికి రాజమార్గం**

**-ఓజిలి మండలాన్ని జిల్లాలోనే అగ్రగామిగా నిలపడమే ధ్యేయం.**

**-పదో తరగతి పరీక్షల పై ఓజిలి ఎంఈఓ శైలజా ముఖాముఖి**




ఓజిలి( ప్రశ్న న్యూస్) పదో తరగతి.. అది కేవలం ఒక పరీక్ష కాదు, జీవిత గమనాన్ని నిర్దేశించే ఒక గొప్ప మలుపు. ఆ మలుపులో తడబడకుండా, ధైర్యంగా అడుగులేసి విజేతలుగా నిలవాలని ఓజిలి మండల విద్యాశాఖాధికారిశైలజ విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థుల సన్నద్ధత, పరీక్షల వ్యూహాలపై. ఈ తరుణంలో విద్యార్థులు అనుసరించాల్సిన వ్యూహాలు, పరీక్షల సన్నద్ధతపై ఓజిలి మండల విద్యాశాఖాధికాణి శైలజాపరీక్షల వేళ విద్యార్థులు అనుసరించాల్సిన 'విజయ సూత్రాల' ఎంఈఓ శైలజా పంచుకున్న ప్రత్యేక ముచ్చట్లు.

### - ప్రశ్న: పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్నాయి, విద్యార్థులకు మీరిచ్చే మొదటి సలహా ఏమిటి

**-ఎంఈఓ శైలజా జవాబు**
పదో తరగతి అనేది ప్రతి విద్యార్థి జీవితంలో ఒక కీలకమైన మలుపు. నా మొదటి సలహా ఒక్కటే.. పరీక్షలంటే భయం వద్దు. ఒత్తిడికి లోనుకాకుండా, చదువును భారంలా కాకుండా 'ఇష్టపడి' చదవండి. అప్పుడే మీరు చదివింది గుర్తుంటుంది, ఫలితం కూడా బాగుంటుంది.

### - ప్రశ్న:వంద రోజుల ప్రణాళికే.. విజయానికి విద్యార్థులకు ఎలా ఉపయోగపడుతుంది

**- ఎంఈఓ శైలజా జవాబు** పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన '100 రోజుల ప్రణాళిక' మండలంలో అద్భుత ఫలితాలను ఇస్తుందని ఓజిలి మండల విద్యాశాఖఅధికారిణి శైలజ ధీమా వ్యక్తం చేశారు. జిల్లా మరియు డివిజన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓజిలి మండలంలోని ప్రతి పాఠశాలలో ఈ ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.ప్రతిరోజూ మండల స్థాయి అధికారులు పాఠశాలలను సందర్శించి, 100 రోజుల ప్రణాళిక అమలును పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, ఉపాధ్యాయులు బోధించే ప్రత్యేక పాఠాలను శ్రద్ధగా వింటే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం చాలా సులభమని స్పష్టం చేశారు. ఈ ప్రణాళిక విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని ఆమె కొనియాడారు.

### -ప్రశ్న: విద్యార్థుల లక్ష్యం ఎలా ఉండాలి

**- ఎంఈఓ శైలజా జవాబు:** కేవలం పాస్ అవ్వడమే కాదు, ఉత్తమ గ్రేడ్లు సాధించడమే లక్ష్యంగా ఉండాలి. తల్లిదండ్రులు మీ మీద ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంటారు. వారి కష్టాన్ని గుర్తించి, వారి ఆశయాలను నెరవేర్చడానికి నిరంతరం శ్రమించాలి. క్రమశిక్షణ కలిగిన విద్యార్థులే రేపటి దేశ పౌరులు.

### -ప్రశ్న: పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్య నియమాలు ఎలా ఉండాలి

**- ఎంఈఓ శైలజా:** కేవలం చదవడమే కాదు, శారీరక, మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యం. విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలి. ఎక్కువగా నీరు తాగుతూ శరీరాన్ని ఉత్సాహంగా ఉంచుకోవాలి. కంటి నిండా నిద్ర ఉంటేనే చదివింది గుర్తుంటుంది. రాత్రంతా మేల్కొని చదవడం కంటే, తెల్లవారుజామున చదవడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.

### - ప్రశ్న: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మీరిచ్చే ప్రత్యేక సూచనలు ఏమిటి

**- ఎంఈఓ శైలజా:** గ్రామీణ ప్రాంతాల్లో వనరులు తక్కువగా ఉండవచ్చు, కానీ పట్టుదల ఎక్కువే. మీరు ఎవరికంటే తక్కువ కాదు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు నిరంతరం అందుబాటులో ఉంటారు. వారిని కలిసి మీ సందేహాలను నివృత్తి చేసుకోండి. సామాజిక మాధ్యమాలు, టీవీలకు ఈ కొన్ని రోజులు దూరంగా ఉంటే మీ లక్ష్యం సులభమవుతుంది.

### - ప్రశ్న: పరీక్షా కేంద్రంలో విద్యార్థులు అనుసరించాల్సిన మెలకువలు

**- ఎంఈఓ శైలజా:** పరీక్ష హాలులోకి వెళ్లేటప్పుడు ఎటువంటి ఆందోళన చెందవద్దు. ప్రశ్నపత్రాన్ని పది నిమిషాల పాటు క్షుణ్ణంగా చదవండి. బాగా వచ్చిన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు రాయండి. అందమైన చేతిరాత, స్పష్టమైన ప్రెజెంటేషన్ మీ మార్కులను పెంచుతాయి. ఒక్క నిమిషం కూడా వృథా చేయకుండా సమయపాలన పాటించాలి. మీరు చదివిన బడికి, మండలానికి వన్నె తెండి.. ఎంఈఓ శైలజ ఆత్మీయ పిలుపు.

### - ప్రశ్న: చివరగా విద్యార్థులకు మీరు ఇచ్చే స్ఫూర్తిదాయక సందేశం ఏమిటి

**- ఎంఈఓ శైలజా**
విద్యార్థులారా. మీరు కేవలం ఒక పరీక్ష రాయడం లేదు, మీ భవిష్యత్తును నిర్మించుకుంటున్నారు. మీరు పడే ప్రతి అడుగు, మీరు చదివే ప్రతి అక్షరం మిమ్మల్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది.

### -ప్రశ్న: పదో తరగతి ఫలితాల మెరుగుదల కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని మీరు ఎలా చూస్తున్నారు

**-ఎంఈఓ శైలజా జవాబు:** పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కృషి చేస్తోంది. ముఖ్యంగా ఉన్నతాధికారుల దిశానిర్దేశంలో రూపొందించిన '100 రోజుల ప్రణాళిక' విద్యార్థులకు ఒక వజ్రాయుధం లాంటిది. ప్రభుత్వం విద్యా వ్యవస్థపై పెడుతున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందుతోంది. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు నిరంతరం పాఠశాలలను సందర్శిస్తూ, విద్యార్థుల ప్రగతిని పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యమైన 100% ఉత్తీర్ణత సాధనలో ఈ కృషే ప్రధాన భూమిక పోషిస్తోంది.

### -బడికి గౌరవం తీసుకువచ్చేలాగా కష్టపడి చదవాలి

మీరు పుట్టి పెరిగిన ఊరు, మీకు విద్యాబుద్ధులు నేర్పిన మీ పాఠశాల గర్వపడేలా మీరు ఫలితాలు సాధించాలి. భవిష్యత్తు ఉన్నత శిఖరాలకు ఎదిగి మీరు పదిమందికి ఉపయోగపడేలా ఎదగాలి.

### - ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు

విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు పడుతున్న శ్రమను ఎంఈఓ శైలజా ప్రత్యేకంగా అభినందించారు. సమయం తక్కువగా ఉన్నా, ఉపాధ్యాయులు ఎంతో కష్టపడి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. వారి నిరంతర కృషి వల్లే విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కాగలుగుతున్నారుఅని ఆమె ప్రశంసించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సమన్వయంతో ముందుకు సాగి, ఓజిలి మండలానికి జిల్లాలోనే మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### - విద్యార్థులు మండలానికి మంచి పేరు తీసుకురావాలి

మన ఓజిలి మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా ప్రతి విద్యార్థి పట్టుదలతో శ్రమించాలి.

### - మీ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు గుర్తింపు తేవాలి

రేపు ఫలితాలు వచ్చినప్పుడు మీ ఫోటోలు పేపర్లో చూసి మీ తల్లిదండ్రులు, మీ ఉపాధ్యాయుల కళ్లల్లో ఆనంద బాష్పాలు చూడాలి.

ఆ తృప్తి ముందు మరేదీ సాటిరాదు.కష్టపడి చదవండి.. ఇష్టపడి పరీక్షలురాయండి.మండలానికి, మీ పాఠశాలకు మంచి పేరు తీసుకురండి. ప్రభుత్వం మీ కోసం ఇన్ని సౌకర్యాలు కల్పిస్తోంది, ఉపాధ్యాయులు మీ కోసం శ్రమిస్తున్నారు. ఇప్పుడు మీ వంతు..

చదువును భారంలా కాకుండా 'ఇష్టపడి' చదవండి. క్రమశిక్షణతో కూడిన మీ కష్టం రేపు మిమ్మల్ని విజేతలుగా నిలబెడుతుంది. మన మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపడమే మన అందరి ఆశయం.విజయంమీదేసమయాన్ని వృథా చేయకండి. ప్రతి నిమిషం విలువైనదే. మీ ఏకాగ్రత మొత్తం పుస్తకాల మీదే ఉండాలి. పట్టుదలతో చదవండి, ఉన్నత శిఖరాలను అధిరోహించండి. విద్యార్థులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

# వైభవంగా గుంత వారి వివాహ వేడుకలు

**- హాజరైన పలువురు రాజకీయ నాయకులు**



**తుగ్గలి:** తుగ్గలి మండల పరిధిలోని గల చిన్న జొన్నగిరి గ్రామంలో వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గుంత దేవి,మాజీ విద్యా కమిటీ చైర్మన్ గుంత రాఘవేంద్ర దంపతుల కుమార్తె ప్రియాంక పెళ్లి వేడుకలు అంగరంగ వైభవంగా శనివారం రోజున జరిగాయి.ఈ వివాహ వేడుకలకు పలువురు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.వివాహ వేడుకలకు హాజరైన పలువురు రాజకీయ ప్రముఖులను గుంత బ్రదర్స్ ఆంజనేయులు,రాఘవేంద్ర లు శాలువాలను వేసి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి,ఎమ్మెల్సీ మధుసూదన్, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ విజయ మనోహరి,కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి,నాగరత్నమ్మ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి తిప్పయ్య స్వామి,మాజీ గ్రంథాలయ చైర్మన్ సుభాష్ చంద్రబోస్,ఏడిసిసి మాజీ చైర్మన్ వీర,మాజీ జెడ్పిటిసి జగన్నాథ్ రెడ్డి,ఎంపీపీ గౌరవ సలహాదారుడు హనుమంతు,జడ్పిటిసి పులికొండ నాయక్,మాజీ ఎంపీపీ ఎర్ర నాగప్ప, ఉప్పర్లపల్లి సొసైటీ చైర్మన్ అప్పా వేణు రాయల్,మారెళ్ళ సొసైటీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,కారం భాస్కర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్,శ్రీరంగడు, రాఘవరెడ్డి,బాలన్న,విద్యా కమిటీ చైర్మన్ మిద్దె రవి,పెరవలి సర్పంచ్ మల్లికార్జున,రాంపురం గంగాధర్, గోవిందరాజులు,నీలా మనోహర్,మాజీ జెడ్పిటిసి నారాయణ నాయక్, మనోహర్,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుడికి అండగా నిలిచిన

# బీసీ ఇందిరా రెడ్డి

**- ప్రభుత్వ పింఛన్ మంజూరు అయ్యే వరకు ప్రతి నెల రూ.3,000 సొంత నిధుల నుండి అందజేస్తానని హామీ...**



**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల గ్రామంలో నిర్వహించిన ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరుకావడానికి వెళ్తున్న సందర్భంగా, అదే గ్రామానికి చెందిన వికలాంగుడు తపాలా చౌడయ్య బీసీ ఇందిరా రెడ్డిని కలిసి తన సమస్యను వివరించారు. సంవత్సరం క్రితం జరిగిన రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, ఇంకా ప్రభుత్వం నుండి పింఛన్ మంజూరు కాలేదని ఆయన ఆమెకు తెలియజేశారు. చౌడయ్య పరిస్థితిని సానుభూతితో విన్న బీసీ ఇందిరా రెడ్డి, ప్రభుత్వం ద్వారా పింఛన్ మంజూరు అయ్యే వరకు తన సొంత నిధుల నుండి ప్రతి నెల రూ.3,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. వికలాంగులు మరియు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి అండగా నిలబడటం తన బాధ్యతగా భావిస్తున్నానని ఆమె తెలిపారు.అదేవిధంగా, సంబంధిత అధికారులతో మాట్లాడి చౌడయ్యకి ప్రభుత్వం నుండి పింఛన్ త్వరగా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటానని కూడా ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆమె సేవాభావాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, గూలి రామచంద్రారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, లోకేపల్లి మధు ప్రసాద్ రెడ్డి, ప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీవన ప్రగతి సాధనే మెట్లోత్సవం అంతరార్థం

- డా. మేడసాని మోహన్
- మెట్లోత్సవంలో పాల్గొన్న సింగపూర్ కళాకారులు
- తిరుపతిలో ఘనంగా మెట్లోత్సవం





తిరుపతి (ప్రశ్న న్యూస్) ధర్మమార్గంలో నడుస్తూ జీవితంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ భగవంతుడిని చేరుకోవడమే మెట్లోత్సవం అంతరార్థమని టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డా. మేడసాని మోహన్ తెలిపారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల వారి 523వ వర్ధంతిని పురస్కరించుకుని టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం ఉదయం అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం నుంచి ఎందరో మహనీయులు మెట్ల మార్గంలో తిరుమలకు నడిచి వెళ్లి స్వామివారి కృపకు పాత్రులయ్యారని చెప్పారు. ఇటువంటి పవిత్రమైన మెట్లోత్సవంలో పాల్గొనడం ఎంతో పుణ్యఫలాన్ని ఇస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి వచ్చిన దాదాపు వెయ్యికి పైగా భజన మండళ్ల సభ్యులు, ప్రముఖ సంగీత కళాకారులు భజనలు చేస్తూ సప్తగిరులను అధిరోహించి స్వామివారిని దర్శించుకుంటారని చెప్పారు. మార్చి 15న ఆదివారం సాయంత్రం తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు లత, అన్నమాచార్య వంశీయులు తాళ్లపాక హరినారాయణాచార్యులు, ఇతర అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు పాల్గొన్నారు.

# రైతు దారికి కంచె

## రహదారి ఆక్రమణలు తొలగించండి

- పాడి రైతులకు తీవ్ర ఇబ్బందులు
- చైర్మన్, కమిషనర్‌కు కురుమ సంఘం వినతి



పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్ ) తాత ముత్తాతల కాలం నుంచి పశువులను మేపుకు తీసుకెళ్లేందుకు ఉపయోగిస్తున్న రహదారిని అక్రమంగా ఆక్రమించి మూసివేసిన ఘటనపై చర్యలు తీసుకోవాలని కురుమ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ దశరథకు వినతి పత్రం అందజేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్లు 678, 679, 680, 681, 682, 683, 684, 694, 695, 696, 697, 698, 699లలో ఉన్న భూమిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించినట్లు కురుమ సంఘం సభ్యులు ఆరోపించారు. ఈ భూమిని ఆక్రమించడంతో పాటు గ్రామ ప్రజలు, పాడి రైతులు ఉపయోగించే రహదారిని కంచె వేసి మూసివేసినట్లు తెలిపారు.
దీనివల్ల గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పాడి రైతులు తమ పశువులను మేతకు తీసుకెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ భూమి వెనుక భాగంలో ఉన్న రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు సరైన దారి లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందని వెల్లడించారు. ఈ భూమి ప్రస్తుతం కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తిగా ఉండటంతో ఇటువంటి అక్రమ ఆక్రమణలు కొనసాగితే ప్రజలకు, ప్రభుత్వ భూమికి నష్టం కలిగే అవకాశం ఉందని కురుమ సంఘం సభ్యులు తెలిపారు. ప్రభుత్వం అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కురుమ సంఘం వార్డు కౌన్సిలర్ కత్తుల రమేష్, అధ్యక్షుడు సప్పటి భాస్కర్, సంఘం నాయకులు కల్వగురి మల్లేష్, సంఘం మల్లేష్, పాదాల ప్రసాద్, మాద నర్సింలు, కొత్త సుధాకర్, మాద యాదగిరి, నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, దాసరి ఆంజనేయులు యాదవ్, రైతు సంఘం నాయకులు నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# తెల్లాపూర్ లో ఈద్ కా తోఫా పంపిణీ

- పటేల్ కూడా ఇఫ్తార్ విందులో ముఖ్యఅతిథిగా
- శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి






పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్) పటాన్చెరువు నియోజకవర్గ పరిధిలోని ముస్లింల ఆర్థిక అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని మే ఫెయిర్ సమీపంలో దర్గాలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన సమావేశంలో మైనార్టీ సోదరులకు ఈద్ కా తోఫాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మైనార్టీలకు తగు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సొంత నిధులతో నిరుపేద మైనార్టీలను ఆదుకోవడంతోపాటు.. ఈద్గాలు మసీదులు ఆశిర్ఖానాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లోనూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేవేందర్ యాదవ్, బాబ్జి, నాగరాజు, శ్రీశైలం, శ్రీపాల్ రెడ్డి, శ్రీకాంత్, మైనార్టీ మత పెద్దలు పాల్గొన్నారు. అనంతరం బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్ గూడ బీహెచ్ఈఎల్ మెట్రో ఎంక్లేవ్ కాలనీలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్లా కృపతో ప్రపంచంలో శాంతి నెలకొని.. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు ఇక్బాల్, శ్రీకాంత్, యునుస్, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## కందకుర్తి పుష్కర ఘాట్ ను సందర్శించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్ ను ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. వచ్చే ఏడాది 2027లో జూన్ 26వ తేదీ నుంచి జులై 07వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని ప్రధానమైన ఈ పుష్కర ఘాట్ ను క్షేత్రస్థాయిలో సందర్శించి, చేపట్టాల్సిన పనుల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గోదావరి, మంజీర, హరిద్ర నదుల కలయికతో త్రివేణి సంగమంగా ప్రసిద్ధి గాంచిన కందకుర్తి ప్రాంతానికి పుష్కర స్నానాల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అన్నారు. గత పుష్కరాలను బట్టి చూస్తే ఈసారి కూడా ప్రతి రోజు సగటున రెండు లక్షల మంది భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎక్కడ కూడా అసౌకర్యాలు ఏర్పడకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండేలా పక్కాగా పనులు జరిపించాలని అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి, షామియానాలు, దుస్తులు మార్చుకునే గదులు వంటివి అందుబాటులో ఉండాలన్నారు. వీఐపీ, వీవీఐపీల కోసం కొత్తగా మరో ఘాట్ నిర్మించాలని సూచించారు. అన్ని ఘాట్ల వద్ద భక్తులకు పూర్తి స్థాయిలో పటిష్ట భద్రత కలిగి ఉండేలా రేయిలింగ్, రక్షణ కంచె ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలని అన్నారు. పుష్కర ఘాట్ వద్ద అవసరమైన వాటికి పెయింటింగ్ చేయించి ఆకట్టుకునే రీతిలో పరిసరాలను ఆకర్షణీయంగా, అందంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. భక్తుల నుండి ఏ చిన్న ఫిర్యాదుకు సైతం ఆస్కారం లేకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రధాన మార్గం నుండి పుష్కర ఘాట్ల వరకు రోడ్డు వెడల్పు, మరమ్మతులు జరిపించాలని అన్నారు. అవసరమైన చోట కల్వర్టులు, వంతెనల నిర్మాణాలు కూడా జరిపించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యానికి తావు లేకుండా చేపట్టాల్సిన ప్రతి పనిని గుర్తిస్తూ సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయరామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్న మంత్రి అనిత

- సింహాచలం చందనోత్సవం, కల్యాణోత్సవం ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష
- సామాన్య భక్తుల దర్శనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం
- రాష్ట్రంలో గ్యాస్ సంక్షోభం లేకుండా ప్రభుత్వం అప్రమత్తం
- సామాజిక మాధ్యమాల్లో కొంతమంది తప్పుడు ప్రచారం
- ప్రజలు వదంతులను నమ్మవద్దు హోం మంత్రి అనిత



సింహాచలం(ప్రశ్న న్యూస్) శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామివారిని హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవస్థాన అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య మంత్రికి వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను మంత్రికి అందజేశారు. అనంతరం రాబోయే సింహాచలం చందనోత్సవం సింహాచలం కల్యాణోత్సవం ఏర్పాట్లపై ఆలయ అధికారులు, అర్చకులతో మంత్రి అనిత సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, గత సంవత్సరం చందనోత్సవానికి సుమారు 1,20,000 మంది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారని తెలిపారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. చందనోత్సవం ఏర్పాట్లపై ఈ నెల చివర్లో మంత్రుల బృందం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సామాన్య భక్తుల దర్శనానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్యాస్ సంక్షోభం లేకుండా ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు ఆర్ టి జి ఎస్ ద్వారా పరిస్థితులను సమీక్షిస్తున్నారని చెప్పారు. ఆర్ టి జి ఎస్ రాష్ట్రానికి గుండె లాంటిదని మంత్రి పేర్కొన్నారు. అధికారులకు ముఖ్యమంత్రి తగిన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వదంతులను నమ్మవద్దని మంత్రి అనిత సూచించారు.

## శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని

# మంత్రి వాకిటి శ్రీహరికి ఆహ్వానం

- మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసి ఆహ్వానించిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో, అర్చకుల బృందం
- మంత్రి దంపతులను మంత్రోచ్ఛారణలతో ఆశీర్వదించిన ఆలయ అర్చకులు
- బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానపత్రికను మంత్రి వాకిటి శ్రీహరికి అందజేసిన ఆలయ ఈవో



హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్) శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో,ఆలయ అర్చకుల బృందం ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రోచ్ఛారణలతో మంత్రి వాకిటి శ్రీహరి దంపతులను ఆశీర్వదించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం దేశవ్యాప్తంగా ఉన్న భక్తులకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆధ్యాత్మిక వేడుక అని ఆలయ అధికారులు తెలిపారు. ఆహ్వానాన్ని స్వీకరించిన మంత్రి వాకిటి శ్రీహరి భద్రాచలం శ్రీరాముని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. మంత్రిని ఆహ్వానించిన వారిలో భద్రాచలం ఆలయం ఈవో దామోదర్, ఆలయ ఉప ప్రధానార్చకులు శ్రీనివాస రామానుజం, రామాయణంపారాయణుడు అంతర్వేదికృష్ణమాచార్య, భవానీ రామకృష్ణలు ఉన్నారు.

## పట్టణ 29వ వార్డు, సుల్తానాబాద్ లో పారిశుద్ధ్య పనులు పరిశీలించిన

- మున్సిపల్ కమిషనర్




తెనాలి (ప్రశ్న న్యూస్) పట్టణము లోని 29 వ వార్డు సుల్తానుబాదు తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించి సిబ్బంది కి పలు సూచనలు చేశారు. శివం ఆపార్ట మెంట్ లో చేస్తున్న హోం కంపోస్ట్ తయారీని పరిశీలించి హోం కంపోస్ట్ యొక్క ఉపయోగాలను స్థానికులకు తెలియజేశారు. ఇండ్లలో వచ్చే కూరగాయలు మిగిలిన అన్నం వంటి కుళ్లిపోయే స్వభావం కలిగిన వాటిని ఎండిన ఆకులను ఒక డబ్బాలో వేసి ఉంచితే సేంద్రియ ఎరువు తయారవుతుందని, అది మొక్కలకు వేస్తే ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులకు తెలియజేశారు మున్సిపల్ సిబ్బంది ప్రతి సచివాలయ పరిధిలో కనీసం వందమంది హోమ్ కంపోస్ట్ చేసే విధంగా చూడాలని హోం కంపోస్ట్ యొక్క ప్రయోజనాలను ప్రజలకు వివరించి అందరు చేసే విధంగా చూడాలని ఆయన సిబ్బంది సూచించారు. హోమ్ కంపోస్ట్ వలన చెత్త ఉత్పత్తిని తగ్గించడంతోపాటు, ఎరువుగా మార్చడం వల్ల పండ్లు పూల మొక్కలకు వేయడం వలన భూమి సారవంతం అవుతుందని తెలియజేశారు .ఇండ్ల నుండి చెత్తను తడి చెత్త ,పొడి చెత్త, హానికర చెత్తగా విభజించి సేకరించడం వలన వివిధ రకాలుగా ఉపయోగించడంతోపాటు చెత్త ఉత్పత్తిని తగ్గించవచ్చని తద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని అన్నారు. ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ దారా రాజేష్, సానిటరీ సెక్రటరీలు ,నగర దీపికలు, స్థానిక ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

# కల్లుగీత వృత్తి సంక్షేమానికి 5 వేల కోట్లు కేటాయించాలి

- ఏజెన్సీ పేరుతో రద్దయిన కల్లు గీత సొసైటీలను తక్షణమే పునరుద్ధరించాలి
- ఈ నెల 17న చలో ఇందిరా పార్క్ ధర్నాను జయప్రదం చేయండి
- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గుండెబోయిన రవి గౌడ్ ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్



ములుగు(ప్రశ్న న్యూస్)కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17 న చలో ఇందిరా పార్క్ మహాధర్నాను జిల్లాలోని కల్లు గీత కార్మికులందరూ హాజరై జయప్రదం చేయాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుండెబోయిన రవి గౌడ్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ లు కల్లు గీత కార్మికుల కు విజ్ఞప్తి చేశారు. శనివారం రోజున (14) న కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ముఖ్యుల సమావేశం జిల్లా కమిటీ సభ్యులు చిక్క అశోక్ గౌడ్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో సంఘం కార్యాలయం లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవి గౌడ్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఏజెన్సీ పేరుతో రద్దయిన సొసైటీలపై గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీ పేరుతో రద్దయిన కల్లు గీత సోసైటీ లను పునరుద్దరణ చేయాలని మాట్లాడడం జరిగిందన్నారు. అధికారం వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటిన కూడా ఇప్పటివరకు రద్దైన సొసైటీలపై ఏమాత్రం స్పందించకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఏజెన్సీలో కల్లు గీత వృత్తిదారులకు గుర్తింపు కార్డు లేకపోవడంతో కల్లు గీత కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు నోచుకోలేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తక్షణమే ఏజెన్సీ సొసైటీలను పునరుద్దరణ చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికునికి వృత్తి పింఛన్ సైట్ ఓపెన్ చేసి పెన్షన్ సాంక్షన్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న 11 కోట్ల రూపాయల ఎక్స్ గ్రేషియాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కల్లుగీత సంక్షేమానికి 5000 కోట్ల నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అన్ని సొసైటీ లకు భూమి కొనుగోలు పథకం కింద భూమికొని ఇవ్వాలని వారన్నారు. ఏరులై పారుతున్న మద్యాన్ని నియంత్రించాలని అన్నారు. ప్రతి గీత కార్మికుని కి టూ వీలర్ బైక్ ఇవ్వాలని జిల్లా కేంద్రం లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలనీ అన్నారు. సమస్యల పరిష్కారం కొరకు ఈనెల 17న కల్లు గీత రణ బేరి పేరుతో జరుగు ఇందిరా పార్క్ ధర్నాను ములుగు జిల్లాలోని అన్ని సొసైటీల నుండి ఇంటికో గౌడ్ ఊరుకో వాహనంతో పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోజిల్లా ఉపాధ్యక్షులు రంగు సత్యనారాయణ గౌడ్. జిల్లా కమిటీ సభ్యులు మునిగాల సుధాకర్ (సురేష్ )గౌడ్ సోషల్ మీడియా కన్వీనర్ ఉయ్యాల మధుకర్ గౌడ్. వత్సవాయి సారయ్య గౌడ్. రుద్రబోయిన మల్లేష్ గౌడ్. తిర్రి సంపత్ గౌడ్ పైడి మల్ల రాకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సదరన్ కమాండ్, పీడీ తో భేటీ :ఎమ్మెల్యే శ్రీ గణేష్





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో పలు ప్రాంతాల్లో సమస్యలు తాండవం ఆడుతున్నాయని నిన్న శనివారం కంటోన్మెంట్ సదరన్ కమాండ్ ప్రిన్సిపల్ డైరెక్టర్ రవీంద్ర కంటోన్మెంట్ బోర్డు కార్యాలయానికి వచ్చిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాల పై చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ఎనిమిది ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న నూతన బిల్డింగ్ బైలాస్ కు వెంటనే ఆమోదం లభించేలా చూడాలని, అలాగే గత కొంతకాలంగా బోర్డు పరిధిలో ఉన్న ప్రజలు మార్టిగేజ్ విధానంలో చిన్న ప్లాట్లకు మినహాయింపు లేక నిర్మాణాలు చేసుకొలేక పలు ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్(ఎఫ్ఎస్ఐ)1.5 నుండి 2.0 కు పెంచాలని, జిహెచ్ఎంసి తరహాలో 239 గజాలు దాటిన ఫ్లాట్లకు మాత్రమే మార్టిగేజ్ విధానాన్ని అమలు చేయకుండా కంటోన్మెంట్ లో అధికారులు 133 గజాలకు సైతం మార్టిగేజ్ అమలు చేస్తే పేదల కల ఎలా నెరవేరుతుందని ఆయన ప్రశ్నించారు. ఈ నూతన మార్ట్ గేజ్ విధానాన్ని మార్చాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే విలీనం చేస్తామని కాలయాపన చేస్తూ ఎన్నికలు లేకుండా చేసి కంటోన్మెంట్ బోర్డులో స్థానిక ప్రజా ప్రతినిధులు లేక,నామినేటెడ్ మెంబర్ వ్యవస్థతో ప్రజాస్వామ్యం అపహాస్యం చేస్తున్నారని పీడీ తో చర్చించారు ఎమ్మెల్యే శ్రీ గణేష్. విలీనం కోసం ఎమ్మెల్యే తాను చేస్తున్న పోరాటాన్ని పిడికి వివరించారు. కేంద్రం నుండి రావాల్సిన సుమారు 1200 పై చిలుకు కోట్ల రూపాయలు సర్వీస్ ఛార్జీలను తక్షణమే విడుదల చేయించాలని, అప్పుడే సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ డైరెక్టర్ రవీంద్ర త్వరలోనే ఆయా అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్ని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ సిఇవో అరవింద్ కుమార్ ద్వివేజ్ తదితరులు పాల్గొన్నారు. రసూల్ పుర జామా మజీద్ ప్రాంతంలోని ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ తోఫాను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నిన్న శనివారం రసూల్ పురలోని జామా మజీద్ ప్రాంతంలోని ముస్లిం సోదర సోదరీమణులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లిం పెద్దలుతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ

ఈ పథకం పేద మధ్యతరగతి ముస్లిం కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, ప్రభుత్వం మంచి ఉద్దేశంతో అమలు చేస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పేద ప్రజల సంతోషమే సర్కార్ ధ్యేయమని, అందరూ ఆనందంగా రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవాలని మైనారిటీలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేష్, రఫిక్, గఫార్, అయూబ్, మజీబ్, ఆంజనేయులు, యూసఫ్ భాను, మల్లేష్, బాలరాజు, స్వాతి, జహంగీర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు

### ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి శ్రీగణేష్..

మోండా డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిర్ర బోయిన బద్రీనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో మారేడ్ పల్లి ప్రాధమిక పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ మమత హాస్పటల్, పార్థా డెంటల్, లయన్స్ ఐ హాస్పటల్ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఆర్థిక స్తోమత లేక హాస్పిటల్స్ కు వెళ్ళలేని వారు ఉపయోగించుకుని, ఉచితంగా పరీక్షలు చేయించుకుని, ఔషధాలు సైతం ఉచితంగా అందుకోవాలని అన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి కూడా ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారని, ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని, ఇలాంటి మంచి కార్యక్రమాలను చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. తాను కూడా శ్రీగణేష్ ఫౌండేషన్ ద్వారా ఇలాంటి కార్యక్రమాలను చేస్తున్నానని,మంచి మనసుతో అందరూ ఇలాంటి కార్యక్రమాలను చేపట్టి పేద ప్రజలకు అండగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

మోండా డివిజన్ షెనాయ్ గ్రౌండ్స్ లో రేపు నిర్వహించే కంటోన్మెంట్ వాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి శ్రీగణేష్ ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు వెస్ట్ మారేడ్ పల్లిలోని షెనాయ్ గ్రౌండ్స్ లో నిర్వహించే కంటోన్మెంట్ వాణి కార్యక్రమాన్ని మోండా డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ పిలుపునిచ్చారు. ఈ కంటోన్మెంట్ వాణి కార్యక్రమంలో జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని డిపార్ట్మెంట్ల రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పాల్గొంటున్నారని, మోండా డివిజన్ ప్రజలు తమకు ఎటువంటి సమస్యలు ఉన్నా ఈ కార్యక్రమానికి విచ్చేసి అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా మౌళిక సదుపాయాల కల్పనలో భాగంగా తాగునీరు, విద్యుత్, ఆరోగ్య, పారిశుద్ధ్య, డ్రైనేజ్, పార్కులు, ఇంజనీరింగ్, రెవిన్యూ, పౌరసరఫరాలు, పోలీస్ శాఖలు సహా ప్రభుత్వ శాఖల అధికారులు ఈ కంటోన్మెంట్ వాణి కార్యక్రమంలో పాల్గొంటున్నారని, మోండా డివిజన్ ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని వారి సమస్యలను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# మెట్‌పల్లిలో “బ్యాండ్ మేళం”

## చిత్ర దర్శకుడు జవ్వాజి సతీష్‌కు ఘన సన్మానం

- మన ప్రాంతం నుండి మరో దర్శకుడు సతీష్ ప్రస్థానం అభినందనీయం

-భారతీయ జనతా పార్టీ నాయకులు



మెట్ పల్లి / ఇబ్రహీంపట్నం ( ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా,మెట్‌పల్లి పట్టణంలో శనివారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన “బ్యాండ్ మేళం” సినిమా దర్శకుడు జవ్వాజి సతీష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు బద్దం గంగాధర్ మాట్లాడుతూ, మన ప్రాంతం నుంచి వెండి తెరపై మరో దర్శకుడు వెలుగులోకి రావడం గర్వకారణమని అన్నారు. ఈ నెల 26న విడుదల కానున్న “బ్యాండ్ మేళం” సినిమా భారీ విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు.అనంతరం దర్శకుడు జవ్వాజి సతీష్ మాట్లాడుతూ, తనను మాత్రమే కాకుండా తాను దర్శకత్వం వహించిన “బ్యాండ్ మేళం” చిత్రాన్ని కూడా ప్రజలు వీక్షించి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మగ్గిడి వెంకట నర్సయ్య, పుప్పాల భానుమూర్తి, తోగిటి రాజశేఖర్, కటకం వేణుగోపాల్, పసునూరి శ్రీనివాస్, బీజేపీ నాయకులు పీసు రాజేందర్, గోపనవేణి రమేష్, గాజనవేణి మహేష్, కల్లూరి అశోక్, మంగ అరుణ్, గూడ కర్రోళ్ల రామ్ రెడ్డి, నందగిరి రాజేంద్రప్రసాద్, ఊళ్ళేంగల మోహన్, వెగ్గెలం చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మాందాపురం గుట్టల అమరుల స్ఫూర్తితో

# పోరాటాలు కొనసాగుతాయి

- సీపీఎం పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి : కడారి రాములు

- మాందాపురం గుట్టల అమరులకు నివాళులర్పించిన సీపీఎం పార్టీ నేతలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని కామ్రేడ్ గుమ్మి పుల్లయ్య స్తూపం వద్ద సీపీఐ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి కడారి రాములు ఆధ్వర్యంలో మాందాపురం గుట్టల్లో 78 సంవత్సరాల క్రితం అమరులైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ తెలంగాణ ప్రాంతం నిజాం నిరంకుశ పాలనలోనే ఉండటంతో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో బద్దం ఎల్లారెడ్డి, ముగ్దమ్ మొయినొద్దీన్, రావి నారాయణరెడ్డి పిలుపుతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రారంభమైందన్నారు. ఉమ్మడి కరీంనగర్ ప్రాంతంలో అనబేరి ప్రభాకర్, సింగిరెడ్డి భూపతిరెడ్డి నాయకత్వంలో “దున్నే వానికే భూమి కావాలి” నినాదంతో పోరాటం సాగి వేల గ్రామాలు విముక్తి పొందాయని తెలిపారు. ఈ క్రమంలో మాందాపురం గుట్టల్లో అనబేరి ప్రభాకర్, సింగిరెడ్డి భూపతిరెడ్డి తదితరులను నిజాం సైన్యం చుట్టుముట్టి కాల్చి చంపిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కామ్రేడ్ కె.వి. అనసూర్య, కోకాపెల్లి శాంతక్క, గాజుల పోశెట్టి, విక్రమ్, రాజు, నర్సన్న, ఎల్లయ్య, రమేష్, చంద్రయ్య, రాజు, శివ, అజ్జ వేణు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలనకు తూడి లచ్చన్న పరామర్శ

- నగదు ఆర్థికసాయం అందజేత



చొప్పదండి / గంగాధర (ప్రశ్న న్యూస్) చొప్పదండి మండలం, రుక్మాపూర్ గ్రామానికి చెందిన తాటికొండ సాయికిరణ్, చిలుక ప్రదీప్ కుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను శనివారం ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న పరామర్శించి, నగదు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పుష్పాలు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సానుభూతి తెలుపుతూ తాటికొండ సాయికిరణ్ కుటుంబానికి రూ.10,000, చిలుక ప్రదీప్ కుమార్ కుటుంబానికి రూ.10,000 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వారికి అండగా ఉంటానని తూడి లచ్చన్న తెలిపారు.

## జాగిర్యాల సర్పంచ్ గడాల ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శనివారం భీంగల్ మండలంలోని జాగిర్యాల గ్రామంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడాల ప్రసాద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి ఎమ్మెల్యేకు హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ గడాల ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాసేవలో నిత్యం నిమగ్నమై తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న వేముల ప్రశాంత్ రెడ్డికి భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల సత్వర పరిష్కార దిశగా శశిధర్ రెడ్డి

రోడ్డు వాగ్దానం నెరవేరింది

సొంత నిధులతో సీసీ రోడ్డు ప్రారంభం



అమీన్‌పూర్ ( ప్రశ్న న్యూస్ ) జీహెచ్ఎంసీ పరిధిలోని బీరంగూడ 270 డివిజన్‌లో ఉన్న నల్లూరి హైట్స్ అపార్ట్మెంట్ కాలనీ వాసుల సమస్యకు అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి స్పందించి సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.నల్లూరి హైట్స్ కాలనీలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో స్థానిక ప్రజలు చాలా కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల కాలనీ అంతా చెత్తగా మారి, వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని కాలనీ వాసులు ఇటీవల శశిధర్ రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు.ప్రజల సమస్యలను తెలుసుకున్న వెంటనే స్పందించిన శశిధర్ రెడ్డి, రోడ్డు సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తన ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఈరోజు నల్లూరి హైట్స్ అపార్ట్మెంట్ సమీపంలో సుమారు 124 మీటర్ల పొడవు గల సీసీ రోడ్డు నిర్మాణ పనులను సొంత నిధులతో ప్రారంభించారు.ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు కల్పించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని తెలిపారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటానని ఆయన చెప్పారు.రోడ్డు పనులు ప్రారంభమైనందుకు కాలనీ వాసులు శశిధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డిని కలిసిన జర్నలిస్టులు

- నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తో భేటీ

- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశమ్మై చర్చ - సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలో ఎమ్మెల్యే తో చర్చించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపుకు తప్పకుండా కృషి చేస్తానని చెప్పారు. దీంతో జర్నలిస్టులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంచరెడ్డి శ్రీకాంత్, వాగ్మారే సుభాష్ ,వైస్ ప్రెసిడెంట్లు బైస సంగీత, గోవింద్ రాజ్, సతీష్ గౌడ్, జాయింట్ సెక్రటరీ లు, క్యాషియర్ రాజ్ తో పాటు కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# అమ్మ ఆశీస్సులు అందరికీ

- గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ జాతర మహోత్సవం ఘనంగా



పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్ ) గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని 1వ వార్డ్‌లో సీజీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ జాతర మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ దశరథ్‌తో కలిసి చైర్మన్ కుమార్ గౌడ్ నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నల్ల పోచమ్మ అమ్మవారి కృపతో ప్రాంత ప్రజలు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇలాంటిజాతరమహోత్సవాలు ఐక్యతను పెంపొందిస్తూ భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను మరింత బలపరుస్తాయని తెలిపారు. గ్రామాల్లో సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుతూ ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కత్తుల రమేష్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఆలయ నిర్వాహకులు, సికేజీ యువసేన సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా బ్లిట్జ్‌క్రిగ్ ముగింపు వేడుకలు




ఓయు (ప్రశ్న న్యూస్)ఉస్మానియా విశ్వవిద్యాలయ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వార్షిక మేనేజ్మెంట్ ఫెస్ట్ ‘బ్లిట్జ్‌క్రిగ్ శనివారం ఘనంగా ముగిసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ ఆడిటోరియంలో జరిగిన ఈ ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్ట రెడ్డి హాజరయ్యారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతున్న వ్యాపార ప్రపంచంలో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, ఆవిష్కరణలు, వ్యూహాత్మక ఆలోచనా విధానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. యువ మేనేజ్మెంట్ గ్రాడ్యుయేట్లు వ్యవస్థాపక నైపుణ్యాలు, నైతిక నాయకత్వంపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. ?డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్మెంట్, ?ప్రొఫెసర్ శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థుల్లో నిర్వహణ సామర్థ్యాలను పెంపొందించడంలో ఇటువంటి విద్యాపరమైన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ ?ప్రొఫెసర్ శేఖర్ ఈ ఫెస్ట్‌ను విజయవంతంగా నిర్వహించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు. ఎంబీఏ కాలేజ్ హెడ్ ప్రొఫెసర్ జహంగీర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మకతను, విశ్లేషణాత్మక ఆలోచనలను ప్రదర్శించడానికి ‘బ్లిట్జ్‌క్రిగ్’ ఒక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డ్యాన్సులు ఉర్రూతలూగించింది.?ఈ కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ జి. విద్యాసాగర్ రావు, సీనియర్ ప్రొఫెసర్ పి. వెంకటయ్య, ప్రొఫెసర్ స్మితా సంబ్రాని, ఈవెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ వి. సమున్నతతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# బాలీవుడ్‌లో కీర్తి సురేష్ మరో భారీ ప్రాజెక్ట్..

## – రాజ్ కుమార్ రావుతో కలిసి సరికొత్త థ్రిల్లర్!

బాలీవుడ్ విలక్షణ నటుడు రాజ్ కుమార్ రావు మరియు సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తొలిసారిగా జతకట్టబోతున్నారు. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'రఫ్తార్' (=ఖుఝుతీ). ఇంటెన్స్ థ్రిల్లర్ డ్రామాగా రాబోతున్న ఈ ప్రాజెక్టును రాజ్ కుమార్ రావు భార్య, నటి పత్రలేఖ తన సొంత నిర్మాణ సంస్థ 'కాంపా ఫిల్మ్స్'పై అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పణలో నిర్మించబోతుంది. విద్యా వ్యవస్థలోని చీకటి కోణాలు, కార్పొరేట్ పోటీ, సక్సెస్ కోసం ఆరాటపడే ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా సాగనుంది. ముఖ్యంగా డబ్బు, అధికారం మనుషుల సంబంధాలను ఎలా మారుస్తాయనే అంశాన్ని దర్శకుడు ఆదిత్య నింబాల్కర్ ఈ థ్రిల్లర్‌లో చూపించబోతున్నారు. ఇక నేషనల్ అవార్డు గ్రహీతలైన రాజ్ కుమార్ రావు, కీర్తి సురేష్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరితో పాటు అనురాగ్ ఠాకూర్, తాన్యా మణిక్తలా మరియు రజత్ కపూర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో 'సెక్టార్ 36'తో మెప్పించిన ఆదిత్య నింబాల్కర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో కథనం చాలా ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ భారీ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.



# తండ్రి పాలిటిక్స్, కొడుకు సినిమాకు బ్రేక్..

## 'సిగ్మా' విడుదలపై సందిగ్ధత.!



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ రాజకీయ అరంగేట్రం ఇప్పుడు టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ సినిమాపై ఊహించని ప్రభావం చూపుతోంది. విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' (ూఱస్త్రఝ). ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ షూటింగ్ ఇప్పటికే పూర్తయినప్పటికీ, విజయ్ తన రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (ూఎఖ) పనుల్లో బిజీగా ఉండటం మరియు ఆయన వ్యక్తిగత జీవితం చుట్టూ ఉన్న తాజా పరిణామాల నేపథ్యంలో మేకర్స్ వెనక్కి తగ్గినట్లు సమాచారం. ఈ సమయంలో సినిమాను విడుదల చేస్తే మీడియా నుండి ఎదురయ్యే రాజకీయ సంబంధిత ప్రశ్నలు జేసన్ సంజయ్‌ను ఇబ్బంది పెడతాయని, అది సినిమాపై ఉన్న శ్రద్ధను పక్కదారి పట్టిస్తుందని నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ భావిస్తోంది. మొదట ఈ చిత్రాన్ని 2025 చివరలో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాతే థియేటర్లలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. ఎస్.ఎస్. తమన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా, తాజా రాజకీయ పరిణామాల వల్ల ఈ సినిమా విడుదల ఆలస్యం కావడం సందీప్ కిషన్ అభిమానులను కాస్త నిరాశకు గురిచేస్తోంది. విజయ్ రాజకీయ తుపాను తగ్గిన తర్వాతే జేసన్ సంజయ్ తన దర్శకత్వ ప్రతిభను వెండితెరపై ప్రదర్శించే అవకాశం కనిపిస్తోంది.

# అదే నిజమైతే టైమ్ మొదలైనట్టే

పన్నెండేళ్ల క్రితం 'ఊహలు గుసగుసలాడే' అనే హిట్ సినిమాతో



టాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది ఢిల్లీ భామ రాశీఖన్నా. ఆ తర్వాత ఎన్టీఆర్, రవితేజ, ధనుష్ వంటి స్టార్లతో సినిమాలు చేసినా, అనుకున్నంత స్టార్‌డమ్ మాత్రం రాశీఖన్నాను వరించలేదు. నిజానికి అందంలోనూ, అభినయ సామర్థ్యంలోనూ నేటి స్టార్ హీరోయిన్లెవరికీ తీసిపోదు రాశీఖన్నా. కానీ ఇండస్ట్రీలో ఎదగాలంటే గుమ్మడికాయంత విద్వత్తుంటే చాలదు, ఆవగింజంత అదృష్టం కూడా ఉండాలి. ఆ అదృష్టం కోసం దశాబ్దానికి పైగా ఎదురుచూస్తూనే ఉంది ఈ అందాలభామ. ఈ నెల 19న రానున్న పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' తన కెరీర్‌కి గేమ్‌ఛేంజర్ అని ఆమె గట్టిగా నమ్ముతోంది. ఇదిలావుంటే, ఈ క్రేజీ సినిమా తర్వాత, వెంటనే మరో పానిండియా సినిమాలో రాశీఖన్నా భాగం కానున్నట్టు తెలిసింది. అల్లు అర్జున్ హీరోగా తమిళ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ ఓ భారీ పాన్ ఇండియా మూవీకి శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీమేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ మూవీలో కీలక పాత్ర కోసం రాశీఖన్నాను దర్శకుడు లోకేష్ కనకరాజ్ సంప్రదించారట. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని తెలిసింది. ఇదే నిజమైతే రాశీఖన్నా టైమ్ నిజంగా మొదలైనట్టే.




# అమ్మ చెక్కిన శిల్పాన్ని నేను

సృష్టిలో తొలి గురువు అమ్మ . పొత్తిళ్లలో బిడ్డకు అమ్మ చెప్పే కథలే జ్ఞానబోధలు. ఎదుగుతూ.. అమ్మని చదువుతూ.. మంచీచెడూ నేర్చుకుంటాం. సమస్త కళలూ అమ్మ పాలధార నుంచే ఉత్పన్నమవుతాయనేది ఆర్యోక్తి. నటి సాయిపల్లవి కూడా ఇదే విషయాన్ని అద్భుతంగా తన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 'అమ్మ చేయి పట్టుకొని నడకే కాదు, నాట్యం కూడా నేర్చుకున్నాను. ఈరోజు మీరు చూస్తున్న సాయిపల్లవి అమ్మ చెక్కిన శిల్పం. మా అమ్మ పేరు రాధామణి. అద్భుతమైన నాట్యకళాకారిణి. నాట్యంలోని మెళకువలన్నీ అమ్మను చూసే నేర్చుకున్నాను. మా అమ్మ నాకు ప్రత్యేకంగా నేర్పింది కూడా ఏమీ లేదు. చూస్తూవుంటే, అలా వచ్చేసింది అంతే. ఒకరకంగా నాట్యం నాకు వారసత్వం ఇచ్చిన వరం.

నా నాట్యం వెనుక ఉండే ఎమోషన్ మా అమ్మ. నా కళ్లలో పలికే భావాలు, పరిణతితో కూడిన నాట్య ముద్రలు, భంగిమలు ఇవన్నీ అమ్మను చూస్తూ నేర్చుకున్నవే. నేను వెస్ట్రన్ వేసినా, ఫోక్ డ్యాన్స్ చేసినా అందులో తెలియని క్లాసిక్ టచ్ ఉంటుంది. దానికి కారణం కూడా మా అమ్మే. నన్ను డాక్టర్ చదివించినా, నాలోని డ్యాన్సర్‌ని మాత్రం అమ్మ నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉంది. అమ్మ అభిరుచిని గుర్తించే నేను నటిని అయ్యాను. అమ్మ సాధించలేనిది సాధించి, ఆ విజయాన్ని అమ్మకు కానుకగా ఇచ్చాను' అంటూ గర్వంగా చెప్పుకొచ్చింది సాయిపల్లవి.

# 15న ఉస్తాద్ ప్రీరిలీజ్ వేడుకలు




పవన్‌కల్యాణ్ అభిమానులకు మరో శుభవార్త. పవన్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రీ-రిలీజ్‌వేడుక ఖరారైంది. మార్చి 15న హైదరాబాద్ పోలీస్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 5గంటల నుంచి ఈవెంట్ మొదలవుతుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. అలాగే దర్శకుడు హరీశ్ శంకర్ కూడా ఈ విషయాన్ని తెలియజేస్తూ 'ఈసారి ఈవెంట్ బద్దలైపోవాలి ఫ్రెండ్స్' అని పేర్కొన్నారు. ఇక శనివారం సాయంత్రం 'ఉస్తాద్' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేసింది. రాశీఖన్నా, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్న ఈ మూవీ మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'గబ్బర్ సింగ్' తర్వాత హరీశ్-పవన్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి.

# మరోమారు అనుష్క పెళ్లి వార్తలు



దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు 'లేడీ సూపర్ స్టార్'గా వెలుగొందిన అనుష్క శెట్టి వివాహ వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. గత కొన్నేళ్లుగా ఆమె పెళ్లిపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ, ఈసారి మాత్రం ఆమె త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. 44 ఏళ్ల అనుష్క ఈ ఏడాది పెళ్లి పీటలు ఎక్కేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వరుడు ఆమె కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్త అని, ఇది పూర్తిగా పెద్దలు కుదిర్చిన సంబంధమని సమాచారం. ఇప్పటికే ఇరు కుటుంబాల మధ్య చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. చాలా కాలంగా అనుష్క పేరు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో కలిపి వినిపిస్తున్న ప్పటికీ, వారిద్దరూ కేవలం ప్రాణ స్నేహితులమని పలుమార్లు స్పష్టం చేశారు. తాజా పరిణామాలతో ఈ రూమర్లకు చెక్ పడే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు, అనుష్క గత చిత్రం 'ఘాటి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం మలయాళ చిత్రం 'కథనార్' షూటింగ్‌లో మాత్రమే పాల్గొంటున్నారు. ఈ సినిమా పనులు పూర్తయిన వెంటనే ఆమె వివాహం చేసుకునే ఛాన్స్ ఉందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

# గ్యాస్ సరఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలం.

## గ్యాస్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలి.

## కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.



మంథని ( ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎరుకల ప్రవీణ్ మాట్లాడుతూ!కేంద్రప్రభుత్వం ప్రజలపై గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారంవేయడం సరైనది కాదని, పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారూ గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అందించాలని వినియోగదారుల కొనుగోలు గడువు గతంలో పట్టణలల్లో 20 రోజుల వ్యవది నుండి 25 రోజులకు,గ్రామాలలో 45 రోజులకు పెంచడం ప్రజలకు, హాస్టల్ లకు, ఫంక్షన్స్,గుడిలో భక్తులకు నిత్య అన్నధాన, ప్రసాదాలకు,హాస్పిటల్ రోగులకు భోజనాలకు ఇబ్బందిగా మారిందని కేంద్రప్రభుత్వం పునఃరాలోచన చెయ్యాలని అమెరికా ట్రంప్ బెదిరింపులకు మోడీ తలోగ్గవద్దని దేశ ప్రజలంత కేద్ర ప్రభుత్వనికి బాసటగా ఉంటారని పేద ప్రజలకు గ్యాస్ అందుబాటులో దొరకకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు పాత పద్ధతిలోనే ప్రజలకు అందుబాటులో గ్యాస్ సిలిండర్ సరిపరా చేయాలని ప్రజలు కోరుతున్నారు

# కొల్చారం మండలం రాంపూర్ లో ఘోర రోడ్ ప్రమాదం అక్కడికక్కడే ముగ్గురు మృతి.



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లి తండ్రి కొడుకులు అల్లుడు తిరిగి వస్తున్న సమయంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు ఈ రోజు సాయంత్రం కొల్చారం మండలం రాంపూర్ శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది..ప్రత్యక్ష సాక్షులు, మృతుల బంధువుల కథనం ప్రకారం... హవేలీ ఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన అమృత్ గౌడ్ (50), అతని కుమారుడు రిషి వర్ధన్ గౌడ్ (12), అతని అల్లుడు సాయ గౌడ్ (35) కలిసి మండలంలోని రంగంపేట గ్రామంలో శనివారం జరిగిన తమ బంధువు ఇంటి తొట్టెల కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో మెదక్–హైదరాబాద్ 765 డి జాతీయ రహదారిపై రాంపూర్ శివారులో మెదక్ వైపు నుంచి నర్సాపూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కొల్చారం పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాలను మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.ఒకే రక్త సంబంధం కావడంతో బంధువుల రోధనతో ఆసుపత్రి లో విషాదచాయాలు అలుముకున్నాయి.

# బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్రకు విశేష స్పందన

**– బీజేపీ అంజన్న ఆశీర్వాద బోయినిపల్లి మండల నేతల భారీ హాజరు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేపట్టిన అంజన్న ఆశీర్వాద యాత్రకు బోయినిపల్లి మండలంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.యాత్ర సందర్భంగా ఆయన పలు గ్రామాలను సందర్శించి స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని నాయకులు తెలిపారు. బోయినిపల్లి మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రకు మద్దతు తెలిపారు. భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కొల్చారం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం తండ్రి -కొడుకు సహా ముగ్గురు మృతి

**ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా కొల్చారం మండలం రాంపూర్ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు.మృతులను హవేలీఘనపూర్ మండలం బూర్గుపల్లికి చెందిన తండ్రి, కొడుకులు అమృత్ గౌడ్ (51), రిషివర్ధన్ గౌడ్ (13) మరియు భూపాతిపూర్‌కు చెందిన సాయి గౌడ్‌గా పోలీసులు గుర్తించారు. వీరు రంగంపేట్‌లో జరిగిన శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదం తీవ్రంగా ఉండటంతో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.ప్రమాదం జరిగిన విషయం రాంపూర్ గ్రామ సర్పంచ్ నెల్లి రాజు ను అడిగి తెలుసుకున్న మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

## రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

## యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారదు.



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,"మత్తు పదార్థాల వినియోగం–అనర్థాలు",సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం మంథని పోలీసులు నిర్వహించారు. శనివారం స్థానిక నృసింహ శివ కిరణ్ గార్డెన్ లో మంథని పోలీస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,"మత్తు పదార్థాల వినియోగం–అనర్థాలు",సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసిపి రమేష్, ప్రవచనకర్త నాయక్ మహారాజ్, మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా మంథని ఎస్ఐ రమేష్ ముఖ్య అతిథులకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ,మత్తు పదార్థాలకు బానిసలైతే ఎవరి భవిష్యత్తైనా నాశనం అవుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకుని తమ ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. యువతలో సహజంగా ఉన్న ఉత్సాహం, శక్తిని క్రీడలు, చదువు, సమాజ అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు.

ఈ వయసులో శారీరకంగా, మానసికంగా ఎక్కువ శక్తి ఉంటుందని,ఆ శక్తిని మత్తు పదార్థాల వైపు మళ్లిస్తే ముందుగా ఆరోగ్యం దెబ్బతింటుందని, తరువాత జీవితమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా దూరం పెట్టాలని, ఎవరికైనా అలాంటి అలవాటు ఉన్నట్లు తెలిసితే ముందుగా వారిని మార్చే ప్రయత్నం చేయాలని, మార్పు రాకపోతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా యువతలోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. నివేదికల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో 60 నుంచి 70 శాతం వరకు యువకులే బాధితులవుతున్నారని తెలిపారు.

వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారును నడిపే సమయంలో సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ఎప్పుడూ రహదారి ఎడమ వైపునే ప్రయాణించాలని, భారీ వాహనాలను దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు. సైబర్ నేరాల విషయంలో కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు అడగడం, అనుమానాస్పద లింకులు పంపడం వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

గతంలో తల్లిదండ్రులు అపరిచితులు ఇచ్చే చాక్లెట్‌లను తీసుకోవద్దని చెప్పేవారని, ఇప్పుడు అదే మోసం మొబైల్ ఫోన్ ద్వారా వచ్చే లింకులు, మెసేజ్‌ల రూపంలో జరుగుతోందని వివరించారు. మొబైల్ ఫోన్ ద్వారా ప్రపంచంతో అనుసంధానం సాధ్యమవుతున్నప్పటికీ, అదే సమయంలో సైబర్ నేరస్థులకు కూడా అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, గ్రామ సర్పంచులు, మాజీ సర్పంచులు, పోలీస్ సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ పథకంతో నిరుపేదల కుటుంబాలకు సొంతింటి కల సాకారం

**- ఎమ్మెల్యే సత్యం కృషికి లబ్ధిదారుల ప్రత్యేక కృతజ్ఞతలు**

**- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య**

**- ఘనంగా సుంకపాక పద్మ**

**- ప్రవీణ్ నూతన గృహ ప్రవేశం వేడుకలు**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం,విలాసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా నిర్మించిన ఇంటికి లబ్ధిదారు సుంకపాక పద్మ-ప్రవీణ్ దంపతులు నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నిరుపేద కుటుంబాలకు అండగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమ సొంతింటి కల నెరవేరిందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య, ఉప సర్పంచ్ పొత్తూరి శైలజ--రాజు, వార్డు సభ్యుడు పోలె శేఖర్ ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ, "ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు సొంత ఇల్లు కల సాకారం అవుతోంది. గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనం అందేలా కృషి చేస్తాం" అని తెలిపారు.అనంతరం లబ్ధిదారు సుంకపాక పద్మ-ప్రవీణ్ మాట్లాడుతూ, "మాకు ఇల్లు నిర్మించుకునే స్థోమత లేకపోయినా ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ పథకం వల్ల మా కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేరింది. ఇందుకు కృషి చేసిన చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యంకు, గ్రామ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మిరుదొడ్డి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పోడ్చన్‌పల్లి తండా వద్ద బొమ్మ బొరుసు ఆడుతున్న 10 మంది కేసు నమోదు

**20,040 నగదు, 10 మొబైల్ ఫోన్లు స్వాధీనం**

**– మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా పాపన్నపేట్ మండలం పోడ్చన్‌పల్లి తండా సమీపంలో బొమ్మా బొరుసు ఆడుతున్న 10 మందిని పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా, కొంతమంది వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు.పట్టుబడిన వారిలో మదారి లింగం, జుకంటి బాబు, జిలకర సాయిలు, వడ్డే సాయిలు, బుచ్చం రాజు, షేక్ రఫీ, గోవింద్ ఆంజనేయులు, తాడేపు సంతోష్, బోడ వినోద్, కొమ్ముల అనిల్ ఉన్నారు. వారి వద్ద నుంచి ?20,040 నగదు మరియు 10 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై పాపన్నపేట్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, జూదాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జూదం కారణంగా కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు సమాజంలో చెడు ప్రభావం పడుతుందని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ప్రజలను కోరారు. అక్రమ కార్యకలాపాలపై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారని ఆయన పేర్కొన్నారు.

## కేసును వేగవంతం, సమగ్రంగా చేయాలన్న ఏసిపి



ధర్పల్లి( ప్రశ్న న్యూస్) నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏ సి పి బి. ప్రకాష్ ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 11నా జరిగిన సంఘటన కాంతామణి మహిళ హత్య కేసు సంబంధించిన సంఘటనా స్థలాన్ని స్వయంగా సందర్శించి ఘటనపై వివరాలు సేకరించారు. సంఘటనకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించి, కేసు దర్యాప్తు వేగవంతంగా, సమగ్రంగా కొనసాగించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే, ధర్పల్లి మండలం హోన్నజీపేట గ్రామంలో నమోదైన ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసు విషయమై ఏసీపీ గ్రామాన్ని సందర్శించి బాధితులు, గ్రామస్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా కొనసాగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా కేసులపై పూర్తి స్థాయి విచారణ జరుగుతుందని, చట్టానికి విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ బి. ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ తో పాటుగా ధర్పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి ఐ బిక్షపతి, ధర్పల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ ఐ శ్రీనివాస్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మండలంలో పోలీస్ బందోబస్తుతో ప్రశాంతంగా ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు

**– బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ రమాకాంత్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు చర్యలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,విలాసాగర్ ప్రభుత్వ పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు నిర్వహించారు.మొదటి రోజు మండలంలో మొత్తం 223 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై శాతం 100 హాజరు నమోదైంది అని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) శ్రావణ్ కుమార్ తెలిపారు.పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను పరీక్ష ప్రారంభానికి అరగంట ముందుగానే అనుమతించి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అధికారులు సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో వైద్య సిబ్బంది,తాగునీరు, వెలుతురు,ఫ్యాన్లు తదితర మౌళిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.

# ఉద్యోగం లేక మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

**– బోయినిపల్లి ఎస్సై : రమాకాంత్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, కొదురుపాక గ్రామంలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాయితోజు శ్రీనివాస్ కుమారుడు కాయితోజు దిలీప్ (26) ఎంబీఏ చదివాడు. అయితే ఉద్యోగం లేకపోవడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో మనస్తాపానికి గురైన దిలీప్ శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న ఇనుప రాడుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బోయినిపల్లి ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

# రేవంత్ రెడ్డి మూడు ముక్కలాట!

## – మూడు కార్పొరేషన్లతో పీఠం వేట



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరం అంటే ఒకప్పుడు ఒకే ఒక్క గ్రేటర్ జీహెచ్ఎంసీ కానీ ఇప్పుడు మన పాలకులు దాన్ని మూడు ముక్కలు చేసి, 'మూడు ఆకులు – అరవై నాలుకలు' అన్నట్టుగా ప్లాన్ చేస్తున్నారు. మొత్తాన్ని కలిపి కొడితే దక్కనిది, ముక్కలు ముక్కలు చేస్తే దక్కుతుందన్న 'డివైడ్ అండ్ రూల్' సిద్ధాంతాన్ని బహుశా మన నేతలు చరిత్ర పుస్తకాల్లోంచి కాకుండా, డైనింగ్ టేబుల్ మీద ఆపిల్ కోసేటప్పుడు నేర్చుకున్నట్టున్నారు!

### - విభజన.. ఒక రాజకీయ ఆపరేషన్!

నగరాన్ని విభజించడమంటే కేవలం అడ్మినిస్ట్రేషన్ కోసమే అనుకుంటే మీరు అమాయకులు. అది పక్కాగా ఓట్ల లెక్కల కోసం జరుగుతున్న 'సర్జికల్ స్ట్రైక్'. వార్డుల పునర్విభజన అంటూ గీతలు గీస్తుంటే, నాయకుల కళ్ళ ముందు మ్యాపులు కనిపించడం లేదు, కేవలం తమకు అనుకూలమైన ఓటర్లు ఏ ఏరియాలో ఉన్నారో అవే కనిపిస్తున్నాయి. మల్కాజ్‌గిరి లాంటి ప్రాంతాల్లో కాస్త కష్టంగా ఉందంటే, వెంటనే అక్కడో కొత్త గీత గీసి, వేరే ప్రాంతాన్ని కలిపి అద్భుతాలు సృష్టించేయాలని ప్లాన్!

### - 99 రోజుల 'మిరాకిల్' ట్రీట్మెంట్!

ఎన్నికలు అనగానే వెంటనే గుర్తొచ్చేది 'అభివృద్ధి'. ఏదో పదేళ్ల పాటు చేసినట్టుగా ఈ 99 రోజుల 'స్పెషల్ డ్రైవ్'లో రోడ్లు వేయడం, గుంతలు పూడ్చడం, పెయింటింగులు వేయడం చూస్తుంటే పాపం హైదరాబాద్‌కు ఇంతకాలం ఏమైంది అనిపించక మానదు. ఓటర్లను ఆకర్షించడానికి సైబరాబాద్‌లో చేస్తున్న హడావుడి చూస్తుంటే, ఎన్నికలయ్యాక ఈ ఫీవర్ మళ్ళీ ఐదేళ్ల పాటు ఆగిపోతుందేమోనన్న అనుమానం రాక తప్పదు.

### - సెటిలర్ల ఓట్లు.. పాతాళంలో ఉన్నా పట్టాల్సిందే!

ఇక 'సెటిలర్ల' ఓట్లపై ప్రత్యేక దృష్టి అంటే, ఆ ఓట్లే ఇప్పుడు నగరాన్ని శాసించే అస్త్రాలు. వలస వచ్చిన వారి ఓట్లు ఏ వైపు మొగ్గితే, మేయర్ పీఠం ఆ వైపు కదులుతుందని తెలిసిన నాయకులు, వారితో మళ్ళీ 'సెటిల్' అవ్వడానికి కొత్త కథలు అల్లుతున్నారు. ఎన్నికలప్పుడు సెటిలర్లు "ఓటు బ్యాంకు"గా, మిగతా రోజుల్లో "ఏదో ఒక వలస వాసులు"గా మిగిలిపోవడం ఇక్కడ ఆనవాయితీ కదా!

### - పీఠం కోసం వేట!

ఒక్క మాటలో చెప్పాలంటే, విడివిడి ఎన్నికల ద్వారా మేయర్ పీఠాలను కైవసం చేసుకోవాలనేది ఒక పెద్ద 'పొలిటిక్స్ మ్యాథ్స్'. ఒక్కో కార్పొరేషన్‌ను ఒక్కో రకమైన అస్త్రంతో గెలవాలని కాంగ్రెస్ వేస్తున్న ఈ ఎత్తుగడలు చివరికి ప్రజలకు మేలు చేస్తాయా లేక కేవలం నేతల పీఠాలను స్థిరపరుస్తాయా అనేది కాలమే తేల్చాలి. ఎందుకంటే, చివరకు గెలిచేది ఏ మేయరో కావచ్చు, కానీ నగరం మాత్రం ఎప్పటిలాగే ట్రాఫిక్ జాంలలో, గుంతల్లో "తర్వాత వచ్చే ఎన్నికల కోసం ఎదురుచూస్తూ" అలాగే ఉండిపోతుంది!

# ఆ మూడు పోర్టుల నుంచి దూరంగా వెళ్లిపొండి.

## – యూఏఈ ప్రజలకు ఇరాన్ హెచ్చరిక



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) మధ్యప్రాచ్యంలో అమెరికా–ఇజ్రాయెల్‌తో యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న వేళ, ఇరాన్ సంచలన హెచ్చరికలు జారీ చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని మూడు కీలక ఓడరేవులను తమ చట్టబద్ధ లక్ష్యాలు (లెజిటిమేట్ టార్గెట్స్)గా ప్రకటించింది. ఆ ప్రాంతాల్లోని ప్రజలు తక్షణమే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. రాబోయే గంటల్లో ఈ పోర్టులపై దాడులు జరగవచ్చని సంకేతాలిచ్చింది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. దుబాయ్‌లోని జెబెల్ అలీ, అబుదాబిలోని ఖలీఫా, ఫుజైరా పోర్టులే తమ లక్ష్యాలని పేర్కొంది. ఈ ఓడరేవుల్లో పౌర ఆవాసాల మాటున అమెరికా సైనిక దళాలు దాగి ఉన్నాయని, కాబట్టి వాటిపై దాడి చేయడం తమకు చట్టబద్ధమైన హక్కని ఇరాన్ స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధిలో ప్రయాణించే నౌకలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. ఇరాన్‌కు చెందిన కీలకమైన ఖార్గ్ ద్వీపంపై అమెరికా దాడులు జరిపిన నేపథ్యంలోనే ఈ హెచ్చరికలు రావడం గమనార్హం. ఇరాన్ ముడిచమురు ఎగుమతుల్లో 90 శాతం ఈ ద్వీపం నుంచే జరుగుతాయి. అయితే, తాము సైనిక లక్ష్యాలనే ధ్వంసం చేశామని, చమురు క్షేత్రాలకు నష్టం కలిగించలేదని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్ కామ్) తెలిపింది. ఇరాన్ చర్యలపై యూఏఈ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ అధికారులు కొద్ది వారాల క్రితం తమ దేశంలో పర్యటించినప్పుడు ఇలాంటి దాడులకు పాల్పడతామని ఎలాంటి సూచన ఇవ్వలేదని, ప్రస్తుత హెచ్చరికలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని యూఏఈ విదేశాంగ మంత్రి లానా నుస్సీబెహ్ అన్నారు. తుపాకులు నిశ్శబ్దమయ్యాకే మధ్యవర్తిత్వంపై చర్చలు సాధ్యమని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటికే సౌదీ అరేబియా, కతార్, కువైట్‌లలోని పలు ఇంధన కేంద్రాలపై ఇరాన్ దాడులు చేసింది. మరోవైపు, ఫుజైరా చమురు కేంద్రం వద్ద ఓ డ్రోన్‌ను కూల్చివేయగా, దాని శకలాలు పడి మంటలు చెలరేగాయి. దీంతో చమురు లోడింగ్ కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ పరిణామాలతో గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా, ప్రపంచ చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోంది.

# ఏపీ క్యాబినెట్ విస్తరణ?

### – చంద్రబాబు స్ట్రాంగ్ డెసిషన్!

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందా? అసలు దానికి ఛాన్స్ ఉందా? చంద్రబాబు సాహసం చేస్తారా? ఇప్పుడిప్పుడే మంత్రులు శాఖలపై పట్టు సాధిస్తున్న క్రమంలో మార్పు అవసరమా? ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఉగాదికి మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం ఇటీవల ఎక్కువైంది. ఓ ఐదుగురు వరకు కొత్తవారు మంత్రులు అవుతారని సోషల్ మీడియా హోరెత్తుతోంది. ఉత్తరాంధ్రలో ముగ్గురు, గోదావరిలో ఒకరు, నెల్లూరుకు చెందిన ఒక మహిళా నేతకు మంత్రి పదవులు ఖాయమని ఒక హడావిడి నడుస్తోంది. కూటమి ప్రభుత్వంలో కొన్ని సమీకరణల మార్పు కోసం ఈ విస్తరణ తప్పదని కొందరు ప్రచారం చేశారు. అయితే సీఎం చంద్రబాబు ఇంతవరకు ఎటువంటి కసరత్తు చేయలేదని టిడిపి వర్గాలు చెబుతున్నాయి.



### - గాడిన పడుతున్న మంత్రులు

అయితే ప్రభుత్వం ఇంకా రెండేళ్లు పూర్తి చేసుకోలేదు. జూన్ నాటికి రెండేళ్లు పూర్తవుతుంది. ఇప్పుడిప్పుడే మంత్రులు తమ శాఖలపై పట్టు సాధిస్తున్నారు. ఇటువంటి సమయంలో చంద్రబాబు ఇంతటి సాహసం చేస్తారా? అనేది ఒక అనుమానం. ప్రస్తుతం రాజకీయాల కంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై దృష్టిపెట్టారు చంద్రబాబు. అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులను పట్టాలెక్కించడంపై ఫుల్ ఫోకస్ పెట్టారు. పైగా ప్రభుత్వం ఏర్పాటైన తక్కువ సమయంలోనే విస్తరణ చేపడితే అనవసర రాజకీయ రచ్చకు కారణం అవుతుందని చంద్రబాబుకు తెలుసు. పైగా ఇప్పుడు ఉన్న మంత్రుల పనితీరును నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు. అసలు రెండేళ్లు పూర్తి కాకుండా మంత్రివర్గ విస్తరణ ఆలోచన సరికాదన్న అభిప్రాయం చంద్రబాబులో ఉందని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

### - ఆ ప్రచారం వెనుక..

ఒకటి మాత్రం నిజం. క్యాబినెట్లో మంత్రులంతా దాదాపు కొత్తవారే. చాలామంది సీనియర్లు ఆశావహులుగా ఉన్నారు. పైగా కీలక నేతలు సైతం ఉన్నారు. అయితే వారికి వివిధ సమీకరణలో ఛాన్స్ రాలేదు. విస్తరణలో ఛాన్స్ ఇచ్చి ఆ టీం తో ఎన్నికలకు వెళ్తారు అన్న ఒక ఆలోచన ఉంది. అందుకే మంత్రి పదవులు ఆశిస్తున్న వారు అలా తమకు తాము లీకులు ఇస్తున్నారు. తమ పేర్లను చర్చలో ఉంచడానికి కొంతమంది అలా ప్రచారం చేయిస్తున్నారు అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. మరోవైపు కూటమిలో విభేదాలు సృష్టించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ తరహా ప్రయత్నం చేస్తుందన్న అనుమానం కూడా ఉంది. అయితే చంద్రబాబు పనితీరుకు ఎక్కువగా ప్రాధాన్యమిస్తారు. పైగా మంత్రివర్గ విస్తరణ అనేది రెండున్నరేళ్ల తర్వాత చివరి రెండేళ్లకు చేస్తారు. అందుకే చంద్రబాబు అటువంటి ప్రయత్నాలు చేయరు అనేది ఒక విశ్లేషణ. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఉగాది నాటికి ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణ పనుల వేగవంతం వంటి లక్ష్యాలను విధించుకుంది కూటమి ప్రభుత్వం. ప్రస్తుతం రాజకీయ సమీకరణల కంటే ప్రజలకు ఇచ్చిన హామీలపైనే దృష్టి పెట్టారు సీఎం చంద్రబాబు. మరోవైపు నిన్న మంత్రివర్గ సమావేశం కూడా జరిగింది. ఉగాదికి మార్పులు చేస్తామనుకుంటే ఇప్పుడు ఉన్న మంత్రులను మానసికంగా సిద్ధం చేసేవారు. కానీ వాటి జోలికి పోలేదని మంత్రులు చెబుతున్నారు. ఉగాదికి మంత్రివర్గ విస్తరణ అనేది కేవలం ప్రచారం మాత్రమేనని అందులో ఏం వాస్తవం లేదని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# లేని గ్యాస్ కొరతను సృష్టించి ప్రజలను భయపెడుతున్నారు

### – బీజేపీ చీఫ్ రాంచందర్ రావు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్యాస్ కొరత, మూసీ ప్రాజెక్టు అంశాలపై ప్రభుత్వ తీరును తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా ఎండగట్టారు. దేశంలో అసలు గ్యాస్ కొరత అనేదే లేదని స్పష్టం చేసిన ఆయన, కొంతమంది కావాలనే లేని కొరతను సృష్టించి ప్రజలను భయపెడుతున్నారని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితుల వల్ల అనేక దేశాల్లో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నా, ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం భారత్‌లో ధరలను నియంత్రణలో ఉంచిందని గుర్తుచేశారు. గతంలో రూ. 1,200 వరకు ఉన్న గ్యాస్ ధరను రూ. 900లకు తగ్గించి సామాన్యుడిపై భారం తగ్గించిన ఘనత కేంద్రానిదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు విషయంలో బీజేపీ వైఖరిని స్పష్టం చేస్తూ, తాము నది శుద్ధికి వ్యతిరేకం కాదని, కానీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని రాంచందర్ రావు హెచ్చరించారు. మూసీ ప్రాజెక్టు కోసం 50 మీటర్ల బఫర్ జోన్ అవసరమే లేదని, కేవలం ఒక గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం 100 ఎకరాల భూమిని సేకరించాలని చూడటం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. గుజరాత్‌లో సబర్మతి ప్రాజెక్టును ఎవరికీ నష్టం కలగకుండా ఏ విధంగా పూర్తి చేశారో ప్రభుత్వం గమనించాలని సూచించారు.

# రోహిణి కార్తెలో కష్టమే!

## – భగభగ మంటున్న సూర్యుడు – 40 డిగ్రీలు దాటుతున్న ఎండ తీవ్రత

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల్లో ఎండలు ముదురుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి భానుడు విరుచుకుపడుతున్నాడు. మధ్యాహ్నం కి తీవ్ర రూపం దాల్చుతున్నాడు. రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అయితే ఈ ఏడాది సంక్రాంతి తర్వాత ఎండల తీవ్రత క్రమేపి పెరుగుతూ వచ్చింది. మధ్యలో వర్షాల వార్తలు వచ్చిన వాటి జాడలేదు. కానీ ఇప్పుడు మార్చి రెండో వారంలోకి ప్రవేశించిన తరుణంలో ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయాయి. 40 డిగ్రీలు దాటుతుండడంతో ప్రమాద హెచ్చరికలు కనిపిస్తున్నాయి. నడి వేసవిలో ఇంతకంటే ఎక్కువ తీవ్రత ఉంటుందన్న సంకేతాలు వస్తున్నాయి. ముఖ్యంగా ఉగాది తర్వాత పరిస్థితి తీవ్రతరం అవుతుందన్న అంచనాలు వెలువడుతున్నాయి. భారత వాతావరణ శాఖ సైతం రాష్ట్రాలను హెచ్చరిస్తుండడం అందులో తెలుగు రాష్ట్రాలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది.



### - 40 డిగ్రీలకు దాటుతున్న ఉష్ణోగ్రత

ఏప్రిల్ తో పాటు మే నెలలో ఎండల తీవ్రత అనేది విపరీతంగా ఉంటుంది. జూన్లో వర్షాలు ప్రారంభమవుతాయి. అదే సమయంలో ఉక్కపోత తీవ్రంగా ఉంటుంది. అయితే ఇప్పుడే 40 డిగ్రీలు ఉష్ణోగ్రత దాటుతోంది. రానున్న కాలంలో 48 డిగ్రీల దాటినా ఆశ్చర్యపోనవసరం లేదు. ముఖ్యంగా రోహిణి కార్తెలో భానుడు ఉగ్రరూపం దాల్చడం ఖాయమన్న ఆందోళన సర్వత్రా ఉంది. ఈ ఏడాది వేసవి అత్యంత తీవ్రతతో ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా లేకపోతే మూల్యం చెల్లించుకోవడం జరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### - పెరుగుతున్న ఎండ తీవ్రత

ఏపీలో గత కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు పతాక స్థాయికి చేరాయి. 40 డిగ్రీలు దాటాయని అమరావతి వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా కోస్తాంధ్రతో పాటు రాయలసీమలో అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాటితో పోల్చుకుంటే ఉత్తరాంధ్రలో ఉష్ణోగ్రతలు కొంత తక్కువే. అయితే వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మరోవైపు ఎండ తీవ్రత పెరగడంతో విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. మరోవైపు తెలంగాణలో ఈనెల 15 నుంచి రెండు రోజులపాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చెప్పింది. కానీ ఏపీలో మాత్రం పొడి వాతావరణం ఉంటుందని చెప్పడంతో వేసవి ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళనతో ఉన్నారు.

# హోర్ముజ్ జలసంధిని అమెరికా తెరుస్తుంది

### – చైనా సహా ఆ దేశాలు యుద్ధ నౌకలను పంపించాలన్న ట్రంప్



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) హోర్ముజ్ జలసంధిని త్వరలో అమెరికా తెరుస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. హోర్ముజ్‌ను ఇరాన్ మూసివేయడంతో ప్రభావితమైన దేశాలు ఇక్కడకు నౌకలను పంపించాలని ఆయన సూచించారు. ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం 15వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఆయన చైనా, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్ లాంటి దేశాలకు కీలక విజ్ఞప్తి చేశారు. హోర్మూజ్ జలసంధి రక్షణ కోసం ఆ దేశాలు నౌకలను పంపించాలని అన్నారు. అమెరికా నావికాదళం త్వరలో హోర్ముజ్ జలసంధి నుంచి ప్రయాణించే నౌకలకు రక్షణ కల్పిస్తుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ట్రూత్ ప్లాట్‌ఫామ్ వేదికగా స్పందించారు. హోర్ముజ్ జలసంధిని మూసివేసిన నేపథ్యంలో ప్రపంచంలోని అన్ని దేశాలు, ముఖ్యంగా ప్రభావితమైన దేశాలు అమెరికాతో కలిసి యుద్ధ నౌకలను పంపించాలని కోరారు. ఈ జలసంధిని మూసివేయడం వల్ల ప్రభావితమైన దేశాలు తమతో కలుస్తున్నాయని తెలిపారు. ఇరాన్ సైనిక స్థావరాలను 100 శాతం నాశనం చేశామని ట్రంప్ పేర్కొన్నారు. తల తెగిన ఇరాన్ లాంటి దేశంతో ముప్పు ఉండదని స్పష్టమవుతోందని అన్నారు. ఇరాన్ తీర ప్రాంతంపై అమెరికా దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. త్వరలో హోర్ముజ్‌ను తెరుస్తామని, ఈ దారిని స్వేచ్ఛగా, సురక్షితంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. చైనా వంటి దేశాలు నౌకలను పంపిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588